J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 45 సంచిక : 47 24.4.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

• ఢిల్లీ పెద్దల ముందు..

# మోకరిల్లిన ఆంధ్రుల ఆత్మగౌరవం







➤ కేంద్రానికి సాహో అంటున్న ఆంధ్ర పార్టీలు

➤ కనీస హక్కులనూ అడగలేని దీనస్థితిలో టీడీపీ, వైసీపీ

➤ క్షోభిస్తున్న ఎన్టీఆర్, వైఎస్సార్ ఆత్మలు


**ఆ**త్మగౌరవానికి, స్వతంత్రతకు ప్రతీక అయిన ఆంధ్ర నేల ఇప్పుడు సాహో అంటూ.. ఇతరుల ముందు మోకరిల్లే దుస్థితికి చేరింది. స్వాతంత్ర్య సమరంలో ఆంగ్లేయులకు సైతం ఎదురు నిలిచిన మన తెలుగు నాయకులు, ప్రస్తుతం కనీసం ఢిల్లీ పెద్దల ముందు తలెత్తేందుకు కూడా జంకుతున్నారు. ఏ పార్టీ హస్తినను హస్తగతం చేసుకున్నా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో దేనికీ వెరవబోమని, మా హక్కులను వదులుకోబోమని తెగేసి చెప్పే ఎన్టీఆర్, వైఎస్సార్ వంటి నేతలు, ఇప్పుడు అంజనం వేసి వెతికినా కనిపించడం లేదు. పైగా కేంద్ర పెద్దలు కోరకుండానే మేం ముందు అంటే, మేం ముందు అనేలా వారికి సాగిలపడుతూ, సాష్టాంగ దండాలు పెడుతున్నారు. తద్వారా ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని నిస్సిగ్గుగా తాకట్టు పెట్టేస్తున్నారు.

**తా**జాగా డీలిమిటేషన్‌తో ముడిపడిన మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలోనూ, దక్షిణభారత దేశంలోని రాష్ట్రాలన్నీ ఏకమై ముందుకు సాగినా, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పక్షాలు మాత్రం మేం బీజేపీ గీసిన గీత దాటం అంటూ బిల్లుకు ఏకపక్షంగా మద్దతు పలికాయి. కనీసం బిల్లులో ఇవి చేర్చండి, వీటిని తొలగించండి, ఇవీ మా డిమాండ్లు అని తెలియజేసే ప్రయత్నం కూడా చేయలేదు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పార్టీల నాయకులకు అసలు వెన్నెముకే లేదని, కేంద్రం ఏది చెబితే దానికి గంగిరెద్దుల్లా తలూపడం తప్ప రాష్ట్రానికి ఏది మంచో ఏది కాదో..? తేల్చుకునే పరిస్థితి లేదని సోషల్ మీడియాలో నెటిజన్లు దుమ్మెత్తి పోస్తున్నారు. ఇక రాజకీయ విశ్లేషకులైతే ఆంధ్రనాయకులు పార్టీలు వేరైనా, వారి మద్దతు మాత్రం అంతిమంగా బీజేపీకే ఉంటుందని, గల్లీలో కుస్తీ, ఢిల్లీలో దోస్తీచేస్తూ తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర ప్రజలని, పరువుని యమునానదిలో కలిపేస్తున్నారని మేధావులు మండిపడుతున్నారు.

## ఢిల్లీ అహంకారానికి వ్యతిరేకంగా పుట్టిన పార్టీ నేడు..?

తెలుగుదేశం పార్టీని తెలుగు ప్రజల గుండెచప్పుడుగా, ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా స్వర్గీయ నందమూరు తారక రామారావు స్థాపించారు. గతంలో నాలుగు దశాబ్దాలకుపైగా దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎన్టీఆర్ తెలుగుదేశానికి పురుడుపోశారు. అప్పట్లో ఢిల్లీపెద్దలు ఎవరి పేరు సీల్డ్‌కవర్లలో పంపితే.. వారే రాష్ట్ర కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రులయ్యే సాంప్రదాయం ఉండేది. చివరికి మంత్రుల జాబితా సైతం ఢిల్లీ కోట నుంచి వర్తమానం వచ్చిన తర్వాతే సిద్ధమయ్యేది. ఇక రాష్ట్ర కేబినెట్ ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, ఏ మంత్రిని తప్పించాలన్నా, అప్పట్లో ముఖ్యమంత్రికి సైతం వీలయ్యేది కాదు. ప్రతి విషయానికీ ఇక్కడి నాయకులు దేహీ అంటూ కాంగ్రెస్ అధిష్టానం ముందు నిలబడి వారి ఆమోదం కోసం పాకులాడేవారు. అలాంటి పరిస్థితుల్లో ఆంధ్రులు ఎవరికీ

2లో



# మోకరిల్లిన ఆంధ్రుల ఆత్మగౌరవం

(మొదటిపేజీ తరువాయి)

తీసిపోరని, తెలుగు నాయకులు ఎవరికీ తక్కువ కాదంటూ తెలుగు ప్రజల జీవితాల్లో వెలుగు నింపే పేరుతో ఎన్టీఆర్ సినీ రంగం నుంచి రాజకీయ రంగంలోకి అడుగుపెట్టారు. పార్టీని స్థాపించిన 8 నెలల్లోనే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి చరిత్ర సృష్టించారు. అప్పటి వరకు కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో రెండో వర్గం పౌరుల్లా వివక్ష అనుభవించిన ఆంధ్రప్రదేశ్ నాయకులకు తెలుగుదేశం పార్టీ ఓ ఆశాకిరణంలా కనిపించింది. దీంతో యువ నాయకులు ఎక్కువగా ఆ పార్టీ వైపు ఆకర్షితులయ్యారు. తద్వారా ఎన్నో రాజకీయ కుటుంబాలు వెలుగులోకి వచ్చాయి. ఇంతటి ప్రాధాన్యం ఘనమైన ప్రస్థానం ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం, ఎన్డీయే కూటమిలో భాగస్వామిగా ఉంటూ రాష్ట్రాన్ని పాలిస్తోంది. అయితే, రాష్ట్ర ప్రయోజనాల కంటే, వ్యక్తిగత ప్రయోజనాలకే నాయకులు ప్రాధాన్యమిస్తూ, ఢిల్లీస్థాయిలో నామమాత్రంగా మారిపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం తీసుకొచ్చే సంస్కరణలు, చట్టాలకు మిత్రపక్షంగా సహకరించడం తప్పుకాదు. అయితే రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టే విషయాల్లోనూ నిర్లిప్తంగా వ్యవహరించడం ఏ మాత్రం సమంజసం కాదని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో ఈ విషయం మరోసారి స్పష్టమైందని అభిప్రాయపడుతున్నారు.

### ఢీ.. లిమిటేషన్‌పై మద్దతు పేరుతో మోదీకి జై..!

చట్ట సభల్లో మహిళలకు 33 శాతం కల్పించే మహిళా బిల్లుకు, రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణకు సంబంధించిన రాజ్యాంగ సవరణ కోసం ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి మరీ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌ను సమావేశపరిచింది. అయితే ఐదు రాష్ట్రాల ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గరపడుతుండగా, అత్యవసరంగా మహిళా బిల్లుకు సంబంధించి ప్రత్యేక సమావేశాలను బీజేపీ పెద్దలు ఎందుకు ఏర్పాటు చేశారో..? తద్వారా ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ఎలా లబ్ధి పొందాలనుకున్నారో అందరికీ తెలిసిన విషయమే. అయితే 131 రాజ్యాంగ సవరణ బిల్లులో కనీసం ఏపీ రాష్ట్రంలో ఎన్ని లోక్‌సభ ఎంపీ సీట్లు పెరుగుతాయి, ఏ స్థాయిలో పెరుగుతాయి, గతంలో బీజేపీ ఇచ్చిన ఒక వ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ నినాదం సంగతేంటి, అనే విషయాలపై ఏమాత్రం స్పష్టత ఇవ్వకుండా బిల్లులు ప్రవేశపెట్టడం విమర్శలపాలైంది. అదే సమయంలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీకి సంబంధించిన నియోజకవర్గాల్లోనూ 33 శాతం మహిళా రిజర్వేషన్ వర్తింపజేయాలనే విషయంలో కూడా క్లారిటీ మిస్సయ్యింది. దీంతో విపక్షాలన్నీ డీలిమిటేషన్ పేరుతో బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందని, దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను తగ్గించకుండా, ఒకవ్యక్తి, ఒక ఓటు, ఒకే విలువ నినాదానికి ఏలా న్యాయం చేస్తారో చెప్పాలంటూ పట్టుబట్టాయి. అయితే ఈ డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోకుండా కేంద్రం 131 రాజ్యాంగ సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టి, మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించడంలో విఫలమైంది. తద్వారా బిల్లు వీగిపోయింది. ఇందులో దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రధాన పార్టీలన్నీ మూకుమ్మడిగా రాజ్యాంగ సవరణ బిల్లును వ్యతిరేకించాయి. తమ రాష్ట్రాలకు పెరిగే లోక్‌సభ సీట్లలో స్పష్టత ఇచ్చిన తర్వాతే డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ ఏ సంవత్సరం నుంచి అమలు చేయాలనే అంశాలను నిర్ణయించాలని ఆయా పార్టీల నాయకులు, ఎంపీలు డిమాండ్ చేశారు. అలా కానీ పక్షంలో బిల్లును వ్యతిరేకిస్తామని స్పష్టం చేస్తూ, లోక్‌సభలో కేంద్రానికి వ్యతిరేకంగా ఓటు వేశారు.

అయితే, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం అధికార తెలుగుదేశం పార్టీ బేషరతుగా 131 రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు తెలిపి, తన చేవలేనితనాన్ని చాటుకుందనే విమర్శలు జోరందుకున్నాయి. ఎందుకంటే, ఇప్పటికే 2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన అసెంబ్లీ సీట్లు 225కు పెంపు, వెనుకబడిన జిల్లాలైన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, పరిశ్రమలకు రాయితీలు, కేంద్రం ఇచ్చే రుణాలపై సబ్సిడీ పెంపు వంటి కీలక విషయాలనే ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. ఇక అప్పట్లో సాక్షాత్తూ ప్రధానమంత్రి హోదాలో ఉన్న మన్మోహన్‌సింగ్ ఇచ్చిన ప్రత్యేక హోదా హామీకి అయితే దిక్కుదివానమే లేదు. అలాంటి పరిస్థితుల్లో డీలిమిటేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో ఎన్ని సీట్లు అదనంగా పెరుగుతాయి, కుటుంబ నియంత్రణ పక్కగా అమలు చేస్తున్నందున, సంతానోత్పత్తి రేటు తక్కువైన మన రాష్ట్రానికి ఏ విధంగా న్యాయం చేస్తారు, అనే విషయాలను కనీస స్థాయిలో ప్రశ్నించకుండానే, చర్చించకుండానే, వాటిని సంఖ్యారూపంలో పొందుపరచకుండానే బిల్లుకు బేషరతుగా మద్దతు తెలపడం కేంద్రానికి జీ హుజూర్ అనడమే అని రాజకీయ విశ్లేషకులు టీడీపీని ఏకిపారేస్తున్నారు.

భవిష్యత్‌లో కుమారుడు లోకేష్‌ను సీఎం చేసే విషయంలో బీజేపీ పెద్దల నుంచి ప్రతిఘటన ఎదురు కాకుండా ఉండేందుకు, తమపై కేసుల విషయంలో ముందు ముందు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకునేందుకే టీడీపీ అధిష్టానం 131 రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలో బీజేపీకి వంతపాడిందనే విమర్శలు జోరందుకున్నాయి. ఢిల్లీ అహంకారానికి, ఎదురునిలిచి ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం పార్టీని స్థాపించానని చెప్పిన ఎన్టీఆర్ ఆత్మ, ప్రస్తుతం తెలుగుదేశం అధిష్టానం వ్యవహరిస్తున్న 'సలామ్ మోదీ భాయ్' విధానంతో క్షోభించకుండా ఉంటుందా..? అని సగటు ఆంధ్రా పౌరుడు ప్రశ్నిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. మరి తెలుగుదేశం పెద్దలు ఈ విషయాన్ని ఇప్పటికైనా గ్రహిస్తారో..? లేక ఎప్పటిలాగే ఆ సమయానికి అలా అనే విధానంతో ముందుకు సాగుతారో చూడాలి.

### వంతపాడిన వైఎస్సార్ వారసుడు..!

ఇక ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సైతం 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకి అనుకూలంగా ఓటు వేసింది. తద్వారా తాము మహిళా రిజర్వేషన్లకు అనుకూలం అంటూ ప్రకటనలు కూడా జారీ చేసింది. అయితే వైఎస్ జగన్ తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి దాదాపు నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో ఉన్నా, ఎప్పుడూ రాష్ట్ర ప్రయోజనాల విషయాల్లో అధిష్టానాన్ని జోక్యం చేసుకోనిచ్చేవారు కాదు. ముఖ్యంగా ఆయన సీఎంగా ఉన్నప్పుడైతే రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో రాజీలేని పోరాటం చేశారు. అప్పట్లో కాంగ్రెస్ చీఫ్ సోనియాగాంధీ సైతం ఏపీ విషయంలో వైఎస్సార్‌ను సంప్రదించకుండా ఏ నిర్ణయం తీసుకోరనే ప్రచారం కూడా ఉంది. ఇక వైఎస్సార్ బతికుంటే అసలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోయేదే కాదని కూడా ఎక్కువ మంది నేటికీ అభిప్రాయపడుతుంటారు. అలాంటి వైఎస్సార్ వారసత్వాన్ని స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉన్న కేసుల భయమో లేక సీబీఐ, ఈడీ వంటి సంస్థలు అటాచ్ చేసిన తమ సంస్థల ఆస్తులకు సంబంధించిన ఆందోళన కారణంగానో, ఎప్పుడూ బీజేపీకి సాగిలపడుతూనే కాలం నెట్టుకొస్తున్నారనడంలో సందేహం లేదు. కనీసం తమ రాజ్యసభ సభ్యులతో బలవంతంగా రాజీనామా చేయించి, కమలం పార్టీలో చేర్చుకున్న మోదీ, అమిత్ షాలను జగన్ ఏనాడు ఒక్కమాట అనలేదు. ఇక తాను ముఖ్యమంత్రిగా ఉండగా, కేంద్రం నుంచి నిధులు విడుదల కాకపోయినా, ప్రత్యేకహోదా రాకున్నా, విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ప్రకటించపోయినా, కనీసం ప్రశ్నించలేదు. పైగా బీజేపీ అడిగిందే తడవుగా రాష్ట్రపతి ఎన్నికల్లోనూ వారి అభ్యర్థికే మద్దతు పలికారు. ఇలాంటి తరుణంలో తాజాగా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు విషయంలోనూ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్కమాటైనా మాట్లడకుండా, కనీసం బిల్లులోని ఏపీ అంశాల్లో మరింత స్పష్టత తీసుకురావాల్సిన అవసరం ఉందో కూడా చూడకుండా గుడ్డిగా, బీజేపీ ప్రవేశపెట్టే రాజ్యాంగ సవరణ బిల్లుకు తమ మద్దతు ఉంటుందని ముందస్తుగా ప్రకటించి మోదీ విషయంలో స్వామిభక్తిని ఘనంగా ప్రకటించుకున్నారు.

ఈ నేపథ్యంలో తన జీవితకాలం మొత్తం కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి బీజేపీని వ్యతిరేకించిన వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారంటూ సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తుతున్నాయి. బీజేపీకి చంద్రబాబు కంటే జగనే ఎక్కువ మద్దతిస్తుంటారని సాక్షాత్తూ చెల్లెలు షర్మిల సైతం జగన్‌పై ధ్వజమెత్తడం గమనార్హం. జగన్ వైఎస్సార్ సిద్ధాంతాలకు వారసుడు కాదని, మోదీపై భక్తి చాటుకునే భజనబ్యాచ్ అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జగన్ తీరు చూసి వైఎస్సార్ ఆత్మసైతం క్షోభిస్తుంటుందని షర్మిల చెప్పడం ఇక్కడ ప్రస్తావనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ, అమిత్‌షా కనుసన్నల్లో మెసులుతూ వారు చెప్పినదానికంతా తానా, తందానా అంటున్న తెలుగు నాయకులు ఢిల్లీలో తమ ప్రతిష్టను కోల్పోవడమే కాకుండా రాష్ట్ర గౌరవాన్ని సైతం తమ స్వార్థ రాజకీయాల కోసం పణంగా పెడుతున్నారంటూ జనం ఆక్రోశం వ్యక్తం చేస్తుండడం గమనార్హం. కొసమెరుపు ఏంటంటే.. ఎలాగూ ఓడిపోతుందని తెలిసి 131వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన బీజేపీ, బిల్లు ఆమోదం పొందడం కోసం ఓటింగ్ సమయంలో ప్రతిపక్ష సభ్యులు సైతం తమ ఆత్మప్రభోదానుసారం ఓటు వేయాలని కోరడం చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం, వైఎస్సార్ సీపీకి సంబంధించిన ఎంపీలు తాము ఆరాధించే ఎన్టీఆర్, వైఎస్సార్ ఆత్మలు క్షోభించేలా కేంద్రానికి సాగిలపడుతూ, ఓటింగ్ సమయంలో తెలుగు ఆత్మగౌరవాన్ని తాకట్టపెట్టారని, తమ ఆత్మలు చంపుకుని మరీ బేషరతుగా బీజేపీ తెచ్చిన బిల్లుకు మద్దతు పలికారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తుండడం విశేషం. ఏదేమైనా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయ నాయకులు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడం ఆంధ్రుల గౌరవాన్ని తగ్గించడమే అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు...!

## ములుముడి కలుజును పరిశీలించిన గిరిధర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ములుమూడి గ్రామంలో 42.50 లక్షల రూపాయల వ్యయంతో జరుగుతున్న ములుమూడి కలుజు మీద బ్రిడ్జి పనులను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఇటీవల పరిశీలించారు. ఈ బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయని, నిర్ణీత సమయంలో పనులను పూర్తిచేసి ప్రజలకు అంకితం చేస్తామని చెప్పారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సారథ్యంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఛైర్మెన్ ఇందుపూరు అచ్యుత్‌రెడ్డి, ఏఎంసీ ఛైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ రాపూరు శేఖర్, జడ్పీ కో-ఆప్షన్ మెంబర్ అల్లాబక్షు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఉపనయనాలు



శంకర జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 22న నెల్లూరులోని ఎన్‌బీఐ కాలనీలో తుమ్మగుంట ద్రావిడ బ్రాహ్మణ సంఘం వారి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి మాచవోలు భాస్కర శర్మ నిర్వహణలో పలువురు బ్రాహ్మణ వటువులకు ఉచిత ఉపనయనాలు నిర్వహించారు. వేద పండితులు అరివిత్తూర్ భర్గ గణపతి సత్రి మాట్లాడుతూ బ్రాహ్మణులు అనుష్ఠాన విధి పూజలను నిర్వహించేందుకు గాయత్రీ మాత ఆశీస్సులు అవసరమని, తద్వారా జపతపాదులు నిర్వహించి మానవాళి శ్రేయస్సుకై పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా వివిధ స్థాయిలో విశేష ప్రతిభను కనపరిచిన మాచవోలు శివరాం ప్రసాద్‌శర్మ , మాచవోలు బాలసుబ్రమణ్య ప్రసాద్‌శర్మ, మాచవోలు గౌరీశంకర్‌శర్మ, సుగుణవతి, ముప్పిరాల రాఘవయ్య శర్మ పల్లెకొండ లక్ష్మీకాంత శర్మ, పల్లెకొండ బాలసుబ్రమణ్యం శర్మ, గుర్రం భానుమూర్తి శర్మ, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వుచ్చి భువనేశ్వరి ప్రసాద్‌శర్మలను సన్మానించారు.

**పుస్తకావిష్కరణ :**

ఈ సందర్భంగా ప్రముఖ రచయిత సూరం ప్రభాకర్ రచించిన 'ప్రాథమిక తెలుగు విద్యార్థి కల్పతరువు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. శాశ్వత గౌరవాధ్యక్షులు మాచవరం కోటేశ్వర శర్మ, అధ్యక్షులు పాటూరు రామశేషయ్య, కార్యదర్శి భాస్కర్ శర్మ, అరిశా రామచంద్రమూర్తి శర్మ, బట్టారం శ్రీనివాస్ శర్మ, బట్టారం సుబ్బు శ్రీనివాస శర్మల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

## కోటమిట్టలో కార్డన్ సెర్చ్!

నెల్లూరు చిన్నబజారు పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటమిట్ట, విరాట్‌నగర్, వెంకటరెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో పోలీసులు ఈనెల 22న కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నగరంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొని, ప్రతి ఇంటినీ తనిఖీ చేసి, ఆ ఇళ్లల్లో ఎవరెవరు ఉంటున్నారో వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నేరాలు జరగకుండా నిరోధించేందుకు ఈ పరిశీలనలు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు తెలిపారు. నేరాల నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఆందోళన బాటలో.. ఆర్టీసీ కార్మికులు



విద్యుత్ బస్సుల పేరుతో నెల్లూరు-2 ఆర్టీసీ డిపోని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 22న నెల్లూరులోని ఆర్టీసీ గ్యారేజీ ఎదుట కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ప్రసాద్, లుక్సన్, షబ్బీర్, రమణయ్య, మురళీరెడ్డి, చెంచయ్య తదితరులు మాట్లాడుతూ, అధికారుల తీరును నిరసించారు. ఉద్యోగులెవరూ బదిలీ ఆప్షన్ ఇవ్వవద్దని, డబుల్ డ్యూటీలు చేయవద్దని నిర్ణయించుకున్నారు. ఆర్టీసీ డిపోని ప్రైవేటు సంస్థకి అప్పగించే ప్రయత్నం చేస్తే సమ్మె తప్పదన్నారు. అధికారులు అలాంటి ఆలోచనని విరమించుకోవాలన్నారు. లేకుంటే మేనెల 5వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు.

# నీటి సమస్యను నివారిద్దాం!

## మారంరెడ్డిపల్లిలో కలెక్టర్



'జలధార' పనులను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

'పల్లె వీక్షణ' కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఈనెల 23వ తేదీ గురువారం ఉదయగిరి నియోజకవర్గం సీతారాంపురం మండలం నారాయణరెడ్డి పల్లెలో విస్తృతంగా పర్యటించారు. తొలుత వదలకుంట చెరువు వద్ద మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కార్యక్రమం కింద 'జలధార' కార్యక్రమంలో భాగంగా చెరువు పూడికతీత పనులను అధికారులతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. గునపం చేతపట్టుకుని ఆయన పనులను ప్రారంభించడం చూసి స్థానికులు ఆశ్చర్యపోయారు. అనంతరం చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గంధంవారిపల్లి అంగన్‌వాడీ పిల్లలతో ముచ్చటించారు. రైతు భరోసా కేంద్రాలు మరియు సచివాలయం సందర్శించారు. రైతు భరోసా కేంద్రంలో తొలుత పిఎండిఎస్ కిట్లను చాంపియన్ రైతులకు అందించారు. గ్రామ సచివాలయంలో పలువురు వద్ద నుండి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి పావని, జిల్లా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

# పండ్లపై రసాయనాలు వాడితే.. కఠినచర్యలు

## • హెచ్చరించిన జాయింట్ కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు

ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే విధంగా నిషేధిత రసాయనాలతో పండ్లను కృత్రిమంగా మాగబెట్టేవారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం సాయంత్రం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో నగరంలోని పండ్ల వ్యాపారులు, సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ అవగాహన సమావేశం నిర్వహించారు. తొలుత అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మామిడి, అరటి పండ్లను ఏ విధంగా కృత్రిమ పద్ధతుల్లో మగ్గబెట్టాలి, ఎలాంటి పద్ధతుల్లో మగ్గబెట్టకూడదో వివరించారు. నిబంధనలు అతిక్రమిస్తే జైలు శిక్షతోపాటు 10 లక్షల జరిమానా విధిస్తామన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, పండ్ల వ్యాపారులు నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించి వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. గోదాములు, నిల్వ కేంద్రాల్లో శుభ్రత, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సంబంధిత అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అక్రమాలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలు కూడా అలాంటి పండ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అసహజంగా మెరుస్తున్న లేదా త్వరగా పండినట్లు కనిపించే పండ్లపై జాగ్రత్త వహించాలని సూచించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, తూనికల కొలతల శాఖ అధికారి ఐజాక్, మార్కెటింగ్ శాఖ ఏడి అనిత, ఫుడ్ సేఫ్టీ అధికారులు, పండ్ల వ్యాపారులు పాల్గొన్నారు.

# ఎండలతో జాగ్రత్త!

వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, జిల్లాలో తీవ్రంగా కాస్తున్న ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నెల్లూరుజిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు, డిజాస్టర్ కమిటీ కో–ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలను తల్లిదండ్రులు గమనిస్తూ, పిల్లల ఆటవిడుపు సమయాన్ని సాయంత్రం వాతావరణం చల్లబడిన తర్వాతే కేటాయించాలని, అలాగే పెద్దవాళ్లు కూడా అత్యవసరమైతే తప్ప ఎవరు కూడా మిట్టమధ్యాహ్నం వేళల్లో ఇళ్లలో నుంచి బయటకు రావద్దని సూచించారు. జిల్లాలోని అన్నదాతలు, పశువుల కాపరులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలని.. పిల్లలు, పెద్దలకు ఎండల తీవ్రత వలన వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎప్పటికప్పుడు తగినన్ని నీళ్లను తాగుతుండాలని చెప్పారు. శీతల పానీయాలకు (కూల్‌డ్రింక్‌లు) దూరంగా ఉంటూ, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ప్రపంచ ఆరోగ్యసంస్థ సూచించిన ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవడం, కాటన్ దుస్తువులను ధరించడం లాంటి జాగ్రత్తలను పాటించాలని ఆయన సూచించారు.

# విరువూరుకు.. ఆధ్యాత్మిక శోభ!

## • 50 లక్షలతో శ్రీ సీతారాముల ఆలయ పునర్నిర్మాణం

పొదలకూరు మండలంలోని విరువూరు గ్రామం ఆధ్యాత్మికశోభను సంతరించుకుంది. గ్రామంలోని శ్రీ సీతా రామస్వామి దేవాలయంలో అంగరంగ వైభవంగా ఈనెల 23వ తేదీ గురువారం నాడు జరిగిన మహాకుంభాభిషేక మహోత్సవంతో గ్రామమంతా కొత్త ఉత్సాహం నెలకొంది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన ఈ వేడుకల్లో ఇద్దరు నాయకులు.. రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, మాజీమంత్రి.. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయడంతో గ్రామంలో సందడి ఏర్పడింది.



శ్రీ సీతారాముల ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే సోమిరెడ్డి

విరువూరులోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో జరిగిన ఆలయ పునర్నిర్మాణం..మహాకుంభాభిషేక మహోత్సవం సందర్భంగా ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠాపన నేత్రపర్వంగా సాగింది. ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛటనల మధ్య..భక్తుల జయజయధ్వానాల మధ్య మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజప్రతిష్ఠ శిలాఫలకాన్ని ప్రారంభించడంతో గ్రామస్తుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ, ఈ ఊరిలోని పురాతన శ్రీ సీతారామస్వామి ఆలయాన్ని అద్భుతంగా పునర్నిర్మించామని తెలిపారు. దేవాదాయ శాఖ కామన్‌గుడ్ ఫండ్ నుంచి రూ. 40 లక్షలు, దాతలు మరియు ఆలయ కమిటీ సభ్యుల నుంచి రూ. 10 లక్షలు సమకూర్చి మొత్తం రూ. 50 లక్షలతో పనులు పూర్తి చేశామని చెప్పారు. ఆలయ అంతరాలయం, గర్భగుడి నిర్మాణాలను పూర్తిగా గ్రానైట్‌తో నిర్మించినట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సూచనల మేరకు ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని కూడా ఆయన తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కామన్ గుడ్ ఫండ్ ద్వారా మరో 7 ఆలయాలకు రూ. 6.48కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. శ్రీవాణి ట్రస్ట్ ద్వారా భజన మందిరాల కోసం సర్వేపల్లి నియోజకవర్గంలోని 10 ప్రాంతాల్లో రూ. 1.65 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ముత్తుకూరు మండలం కృష్ణపట్నం ప్రాంతంలోని శ్రీ విశ్వేశ్వరస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధికి కేంద్ర పురావస్తు శాఖ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### 600 ఆలయాలకు త్వరలో మహర్దశ - మంత్రి ఆనం

ప్రతి గ్రామంలోనూ ఆధ్యాత్మికత వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ, ప్రభుత్వం కోట్లాది రూపాయలతో పురాతన ఆలయాల పునర్నిర్మాణం, అవసరమైన చోట కొత్త ఆలయాల నిర్మాణం చేపడుతోందని మంత్రి ఆనం ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రంలో 600కు పైగా పురాతన ఆలయాల పునర్నిర్మాణం జరుగుతోందని, తద్వారా ఆ ఆలయాలకు మహర్దశ కలుగుతుందని ఆయన ఆకాంక్షించారు. టీటీడీ ఆధ్వర్యంలో రాబోయే రెండేళ్లలో 5వేల కొత్త ఆలయాల నిర్మాణానికి రూ. 750 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా జిల్లాలోనూ కోట్లాది రూపాయలతో పురాతన ఆలయాల నిర్మాణం, అభివృద్ధి పనులు జరుగుతున్నాయని నెల్లూరు జిల్లాను ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి వివరించారు. దేవాదాయ శాఖ మంత్రిగా రాష్ట్రంలో ఆలయాలు అభివృద్ధికి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి..ఆనం చేస్తున్న కృషికి ఆనందం వ్యక్తం చేశారు.

# వ్యర్థాల నిర్వహణకు..త్వరలోనే కొత్త యాప్!

## ఏపీఇఎంసీఎల్ ఛైర్మెన్ దినేష్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి ఆలోచనలకు అనుగుణంగా, రాబోయే రోజుల్లో వ్యర్థాల ట్రాకింగ్ మరియు నిర్వీర్యం ప్రక్రియను మరింత సమర్ధవంతంగా చేయడానికి ఆధునిక సాంకేతికతతో ఒక కొత్త యాప్‌ను రూపొందిస్తున్నామని, ఆ వ్యవస్థ ద్వారా వ్యర్థాలను పునర్వినియోగంలోకి వచ్చి, పర్యావరణ పరిరక్షణకు మరింత బలం చేకూరుతుందని ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఏపీ ఇఎంసిఎల్) ఛైర్మెన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తెలిపారు. బయో వ్యర్థాలు, హాస్పిటల్ వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించి కూడా ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే దేశానికి ఆదర్శంగా నిలిచేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణలో ముందంజలో ఉంచేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని ఆయన తెలిపారు.



అనకాపల్లిలోని పరిశ్రమలను తనిఖీ చేస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

# జగన్..మహిళా పక్షపాతి! - రామ్‌కుమార్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్‌సీపీ సమన్వయకర్త, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల ఆయన వెంకటగిరిలోని తమ నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, మహిళా సాధికారతకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. అందుకే, మహిళల రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లుకు కూడా జగన్ మద్దతు ప్రకటించారని ఆయన ప్రశంసించారు.



మహిళలకు 50శాతం ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందన్నారు. కుటుంబాన్ని ఆర్థికంగా శక్తివంతం చేసే శక్తి మహిళలకే ఉంటుందని గ్రహించిన మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పథకాల నగదు నేరుగా మహిళల ఖాతాల్లో జమ చేయించారని, 33శాతం కంటే ఎక్కువగా 50శాతం రిజర్వేషన్లు అమలుచేసిన ఘనత ఒక్క వైఎస్ఆర్‌సీపీకే దక్కిందని అన్నారు. మహిళా బిల్లు పార్లమెంట్‌లో నిలిచిపోవడం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా ఉందని, 2027 రాష్ట్రంలో మళ్ళీ వైసీపీయే అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తూ, అప్పుడు కూడా తమ హయాంలో జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్, డీ–లిమిటేషన్ బిల్లుల భవితవ్యంపై కాలమే సమాధానం చెప్పాలని ఆయన అన్నారు.

లాయర్
ఏప్రిల్ 24, 2026

# అయోమయంలో..'ఉపాధి హామీ' పథకం!

కొంతకాలం క్రితం కోట్లాదిమంది నిరుపేద కష్ట జీవులను ఆదుకున్న ఉపాధి హామీ పథకం..ఇప్పుడు అయోమయస్థితిలో పడిపోయింది. గత డిసెంబరులో 'వీబీ జీ రామ్‌జీ పథకం'గా పేరు మార్చుకుని కొత్తచట్టంగా అవతరించినా, ఇప్పటికీ ఆ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు, నియమ నిబంధనలు, నిధుల విడుదల విధానం వగైరాలు పూర్తిస్థాయిలో రాకపోవడంతో దీని పరిస్థితి ఒకడుగు ముందుకి, రెండడుగులు వెనక్కి అన్నట్లుగానే ఉంది. ఈ వేసవికాలం ఉపాధి పనులకు మరింత అనువైన కాలం. రోడ్ల పనులు, కాలువలు, చెరువుల పనులు వంటివి ముమ్మరంగా చేపట్టాల్సిన సమయం. అయితే, క్షేత్రస్థాయిలో ఈ పేదల పథకం పట్ల అలక్ష్యం, అవకతవకల విధానాల వల్ల అంతా అస్తవ్యస్తంగా తయారైంది. గతంతో పోలిస్తే ఇప్పటికే లక్షలాదిమంది పేదలు, నిరుపేద కూలీలు ఈ పథకానికి దూరమవుతున్నారని నిపుణుల అంచనా. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ఈ పనులు బాగా తగ్గిపోతుండడంతో పేదలు అష్టకష్టాలు పడుతున్నారని, కేంద్రం ప్రకటించిన వేతనాలు కూడా ఉపాధి కూలీలకు సక్రమంగా అందడం లేదనీ గ్రామీణ ప్రాంతాల్లో గగ్గోలుగా ఉంది. ఉపాధి కల్పనకు ఇచ్చే పనిదినాలు కూడా తరిగిపోతుండడంతో కూలీల్లో నిరాశ వ్యక్తమవుతోంది. ఉపాధి పనులు చేసే కూలీల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోతోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా ఉపాధి కూలీల వేతనాలు పెరగకపోవడం, మరోవైపు పని దినాలు తగ్గిపోవడంతో కార్మికులు జీవనోపాధి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు.. ఈ పథకాన్ని అప్పనంగా ఆరగిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారుల అవినీతిని, అవకతవకలను అరికట్టడంలో ఎన్ని కఠినచర్యలు తీసుకుంటున్నా ఇది అవినీతిపరులకు భోజ్యం అవుతూనే ఉంది. కూలీలకు జాబ్‌కార్డులు ఇచ్చే దగ్గరనుంచి, వారిచేత పనులు చేయించి, వేతనాలు ఇచ్చేవరకూ అన్ని దశల్లోనూ అవకతవకలే జరుగుతుండడంతో కేంద్రం ఈ పథకాన్ని ప్రక్షాళన చేసి, కార్మికులకు అనువుగా సంస్కరించాలని అనేక మార్పులు చేర్పులు చేసింది.

అయితే, వాస్తవానికి దేశవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేయడమంటే అంత తేలికైన విషయం కూడా కాదు. నెలలు గడుస్తున్నా పథకం అమలు మాత్రం ఆశించినస్థాయిలో ముందంజ వేయకపోవడం..ఈ పథకాన్ని నమ్ముకుని ఉన్న కష్టజీవులకు ఆవేదన కలిగిస్తోంది. ఇదే అదనుగా అవినీతిపరులు మాత్రం అందినకాడికి దోచుకుంటున్నారు. ఉపాధి కూలీలకు ఈ మండుటెండల్లో ఇబ్బందిలేకుండా కనీస వసతులు కల్పించేందుకు కేంద్రం నిధులు కేటా యించినా, రాష్ట్రంలో చాలాచోట్ల అలాంటివేమీ కల్పించ కుండానే, దొంగలెక్కలు రాసేసి క్షేత్రస్థాయిలోనే నిధులు స్వాహా చేసేస్తున్నారనే ఆరోపణలు బోలెడు. కూలీలకు చలువపందిళ్ళు కానీ, మజ్జిగ లేదా ఓఆర్ఎస్ వంటివి కనిపించడం లేదని, చివరికి వేసవిలో ఇవ్వాల్సిన అదనపు వేతనం ఇవ్వడమే లేదని, ముఖ్యంగా ఏపీలో అనేకప్రాంతాల్లో ఈ నిధులన్నీ పక్కదారిపడుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కేంద్రం నుంచి స్పష్టమైన విధానాలు ఇంకా క్షేత్రస్థాయి అధికారులకు రాకపోవడంతో, ఈ పథకాన్ని ఎలా అమలు చేయాలా అని వారు సందిగ్ధంలో ఉంటున్నారు. కొత్త పథకంపై స్పష్టత వచ్చేదాకా, ప్రస్తుతానికి పాత విధానంలోనే కేటా యింపులు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గ్రామీణాభి వృద్ధికి సంబంధించి ఈ పథకం మరింతమంది నిరుపేదలకు విస్తృత ప్రయోజనం కలిగించే విధంగా ఉండాలనేది కేంద్రం ఆకాంక్ష. ఆమేరకు సంస్కరణలకి కేంద్రం సంకల్పించినా, ఆచరణలో కాలయాపన జరుగుతూ ఉండడంతో.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఈ పథకం పట్ల మునుపటి ఉత్సాహం ఉండడం లేదు. ధరలు ఆకాశానికంటుతున్న నేటి రోజుల్లో ఉపాధి వేతనాలు పెరిగితే బావుణ్ణు అని నిరుపేద కూలీలు ఆశిస్తున్నారు కానీ, కొత్త పథకం వచ్చేనాటికి అది ఏ రూపు సంతరించుకుంటుందో తెలియడం లేదు. ఈ పథకానికి అయ్యే వ్యయంలో ఎంతశాతం కేంద్రం భరాయిస్తుందో కూడా ఇంకా ఊహాగానాల్లోనే ఉండడంతో, ఈ పథకాన్ని ఎలా అమలుచెయ్యాలో రాష్ట్రాలకు కూడా అంతుపట్టడం లేదు. ఇకనైనా కేంద్రం ఈ పథకాన్ని మరోసారి పూర్తిస్థాయిలో సమీక్షించి, వెంటనే తగు మార్గదర్శకాలు ప్రకటించాల్సి ఉంది. ఈ పథకం అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా ఈ పథకాన్ని అవినీతిపరులకు అందకుండా చేసి, కష్టజీవులను అన్నివిధాలా ఆదుకోవాల్సి ఉంది.

# హిందుస్థాన్‌లో ప్రమాదంలో హిందుత్వం!

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

ఇటీవల దేశంలో జరుగుతున్న మత మార్పిడులపై వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా నాసిక్‌లోని కార్పొరేట్ సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్‌లో జరిగిన అతిపెద్ద జిహాద్ కుట్ర దేశాన్ని కుదిపేసింది. దాంతో పాటు లెన్స్‌కార్ట్ ఉదంతం, లూలూ మాల్ సంఘటన, జిమ్ జిహాద్ వంటి అంశాలు, మేధావి వర్గాన్ని ఆలోచింపజేస్తున్నాయి. హిందూబంధువు లని ఆందోళనకి గురి చేస్తున్నాయి. వీటన్ని టికీ కారణం ఎవరు? లోపం ఎక్కడుంది?? అని చర్చించుకుంటూ, మనల్ని మనమే ప్రశ్నించుకుంటూ వదిలేయడం వల్ల మనకు ఒరిగేదేమీ ఉండదు. కావలసినంత మంది భార్యలు, దజన్ల కొద్దీ సంతానం, చాక చక్యంగా మతమార్పిడులు, విదేశాల నుండి అక్రమంగా వలసలు. ఇలా వాళ్ళు చాలా క్లారిటీతో ఉన్నారు. వాళ్ళ మతాన్ని వ్యాప్తి చేసుకోవడం కోసం ఓనమాలు రానివాడి నుండి ఇంజనీర్లు, డాక్టర్లు, వ్యాపార వేత్తలతోపాటు అత్యున్నత చదువులు చదువుకున్న వారు సైతం మత మార్పిడి కోసం వాళ్ళ వంతుగా వాళ్ళు ప్రయత్ని స్తూనే వున్నారు. ఐదో తరగతి ఫెయిల్ అయిన హిందూ వ్యక్తి సైతం సెక్యులరిజం గురించి మానవత్వం, సమానత్వం గురించి ఉపన్యాసాలు ఇస్తాడు. హిందూ మతం లోని లోపాల గురించి చర్చిస్తాడు. కానీ, అవతలి మతంలో మాత్రం ఐదేళ్ల పిల్ల వాళ్ళు సైతం బుర్ఖా ధరించడానికి వెనుకాడరు. ఉన్నత విద్యావంతులు కూడా వాళ్ల మతంలో ఉన్న ఒక్క అంశాన్ని అవహేళన చేయడానికి ఇష్టపడరు. మండుటెండల్లో సైతం బుర్ఖాను ధరించ డానికి వెనకాడని ఆచారం వాళ్ళది.కనీసం నుదుటన తిలకం పెట్టుకోవడానికి కూడా ముందుకురాని మూర్ఖపు ఫ్యాషన్ మనది. ఇలా అయితే భవిష్యత్తులో హిందూమతాన్ని భూతద్దంలో వెతుక్కోవలసిందే. వందల సంవత్సరాల పాటు అనేక దాడులను తట్టుకొని నిలబడిన గొప్ప మతం మనది. అలాంటి మతం ఇప్పుడు శాంతియుత హిందుత్వ, సెక్యులరిజం పేరుతో మరుగున పడే ప్రమాదంలో ఉంది. ఇకనైనా మేల్కొందాం. లేకపోతే భవిష్యత్తు తరాలు మనల్ని క్షమించవు...!

– ఓ హిందుస్తానీ.

# నెల్లూరులో పేట్రేగిపోతున్న చిల్లర దొంగలు

నెల్లూరు నగరం చిల్లర దొంగలకు నిలయంగా మారిపోయింది. ముఖ్యంగా చైన్ స్నాచర్లు, జేబు దొంగలు, ద్విచక్ర వాహన చోరులు ఎక్కువైపోయారు. ఇళ్ళలోకి జొరబడి సైతం మహిళల మెడలోని ఆభరణాలని తెంచుకుని పోతున్నారు. ఇక రద్దీ ప్రదేశాల్లో, దేవాలయాల వద్ద కూడా ఈ చైన్‌స్నాచర్లు, జేబుదొంగలు తమ హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. నగరంలోని చాలా ప్రాంతాలలో ద్విచక్రవాహనాలు అధిక సంఖ్యలో మాయమవుతున్నాయి. పోలీసులు ఇలాంటి పెట్టీ దొంగతనాలని సీరియస్‌గా తీసుకోవడం లేదు. వందలకొద్దీ ఫిర్యాదులు వస్తున్నా పట్టించుకోవడంలేదు. ఈ విషయాలపైన ఎస్పీ మేడం దృష్టిపెట్టాలి. ముఖ్యంగా మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువత ఎక్కువగా ఇలాంటి చిల్లర నేరాలకు పాల్పడుతున్నారు. పోలీసువారు గట్టి నిఘాపెట్టి వాటిని నిర్మూలిస్తే దొంగతనాల సంఖ్య కూడా తగ్గుతుంది.

డి. కృష్ణమూర్తి - నవాబుపేట, నెల్లూరు.

# 'జూనియర్' కొలువులు మాయం

మనసులో మాట 94

ప్రస్తుతం ప్రపంచ జాబ్ మార్కెట్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంటున్నది. సాఫ్ట్‌వేర్ నుండి బ్యాంకింగ్ వరకు అన్ని రంగా ల్లోనూ కొత్తగా పట్టభద్రులైన యువతకు (Freshers) తలుపులు మూసుకుపోతున్నాయి. దీనిని ఆర్థికవేత్తలు "ఎంట్రీ-లెవల్ ఉద్యోగాల అంతం" అని పిలుస్తున్నారు. ఒకప్పుడు కాలేజీ నుండి బయటకు రాగానే జూనియర్ హోదాలో చేరి, సీనియర్ల దగ్గర ఓనమాలు నేర్చుకుంటూ కెరీర్‌ను నిర్మించుకోవడం ఒక పద్ధతి. కానీ నేడు ఆ మొదటి మెట్టే మాయమవుతోంది. దీనికి ప్రధాన కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) తెచ్చిన నిర్మాణాత్మక మార్పు. ఇది కేవలం సాంకేతిక మార్పు మాత్రమే కాదు, ఒక తరం యొక్క జీవనోపాధిని ప్రశ్నిస్తున్న పరిణామం. గతంలో మనుషులు చేసిన విశ్లేషణాత్మక పనులను ఇప్పుడు మెషీన్లు అద్భుతమైన వేగంతో చేస్తున్నాయి. మనం చూస్తున్న ఈ మార్పు ఇన్నాళ్లుగా వస్తున్న పని ఆరోహణ పద్ధతులను తలకిందులు చేస్తోంది.

గోల్డ్‌మన్ సాక్స్ (Goldman Sachs) 2026 ఫిబ్రవరి నాటి సంచలన నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగంలో 54% , న్యాయ రంగంలో 44% పనులు ఇప్పటికే పూర్తిస్థాయిలో ఆటోమేషన్ అయ్యాయి. సాధారణంగా ఈ పనులన్నీ గతంలో ఫ్రెషర్లు చేసేవారు. డాక్యుమెంట్ల పరిశీలన, ప్రాథమిక డేటా విశ్లేషణ, రీసెర్చ్ వంటి పనులను ఇప్పుడు ఏఐ ఏజెంట్లు సెకన్ల వ్యవధిలో పూర్తి చేస్తున్నాయి. ఇక్కడే ఒక విచిత్రమైన పరిస్థితి తలెత్తింది. గతంలో పదిమంది చేసే పనిని ఇప్పుడు ఏఐ సహాయంతో ఒక జూనియర్ ఉద్యోగి చేయగలుగుతున్నారు. అంటే, ఒక వ్యక్తి ఉత్పాదకత పెరిగింది కానీ, ఆ పెరిగిన ఉత్పాదకతే మిగిలిన తొమ్మిది మంది ఉద్యోగాలను మింగేస్తోంది. దీనివల్ల కంపెనీలకు ఖర్చు తగ్గుతున్నప్ప టికీ, కొత్తవారికి ఉద్యోగ మార్కెట్లోకి ప్రవేశం లభించడం గగనమవుతోంది. ఈ పరిస్థితులు కేవలం బహుళజాతి సంస్థలకే పరిమితం కాకుండా చిన్న , మధ్యతరహా పరిశ్రమలకు కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి.

పీడబ్ల్యూసీ 2026 ఏప్రిల్‌లో విడుదల చేసిన 'గ్లోబల్ జాబ్స్ బేరోమీటర్' ప్రకారం, ఏఐ టూల్స్ వాడుతున్న జూనియర్ల ఉత్పాదకత గత రెండేళ్లలో 34% పెరిగింది. ఇది వినడానికి కంపెనీల లాభాల కోణంలో బాగున్నా, దీని వెనుక ఒక సామాజిక సంక్షోభం దాగి ఉంది. స్టాన్‌ఫోర్డ్ డిజిటల్ ఎకానమీ ల్యాబ్ తమ "కెనరీస్ ఇన్ ది కోల్ మైన్" నివేదికలో ఒక తీవ్రమైన హెచ్చరిక జారీ చేసింది. ఒక ప్రొఫెషనల్ తన కెరీర్ తొలి దశలో చేసే 'చిన్నపాటి పనులు' (Grunt work) వారిని వృత్తిపరంగా తీర్చిదిద్దడమే కాకుండా, వారిలో ఒక రకమైన 'ప్రొఫెషనల్ జడ్జిమెంట్'ను పెంచుతాయి. ఇప్పుడు ఆ పనులన్నీ నేరుగా మెషీన్లే చేసేస్తుండటంతో, యువతకు ఆ 'శిష్యరికం' చేసే అవకాశం లేకుండా పోతోంది. పునాది లేకుండా కేవలం టూల్స్ వాడటం నేర్చుకున్న వారు 2030 నాటికి సీనియర్ స్థాయికి చేరుకున్నా, క్లిష్టమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వారిలో ఉంటుందా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. మన భవిష్యత్తు నాయకత్వాన్ని మనం స్వయంగా బలహీనపరుస్తున్నామా అనే అనుమానం కలుగుతోంది.

భారత్‌లో గతేడాది కంటే ఈ ఏడాది ఫ్రెషర్ల నియామకాల్లో స్పష్టమైన తగ్గుదల కనిపిస్తోంది. ఐటీ రంగంలో 'క్యాంపస్ ప్లేస్‌మెంట్స్' స్థానంలో 12 నుండి 18 నెలల సుదీర్ఘ 'అప్రెంటిస్‌షిప్'లు వచ్చి చేరాయి. అంటే కంపెనీలు ఇప్పుడు అభ్యర్థికి నేరుగా ఉద్యోగం ఇవ్వడం లేదు; వారిని ఒక ఏడాది పాటు తక్కువ వేతనంతో పరిశీలించి, ఏఐతో పని చేయించడంలో వారు ఎంత సమర్థులో చూశాకే పర్మనెంట్ చేస్తున్నాయి. అంతేకాదు, ఏఐ నైపుణ్యం ఉన్న ఫ్రెషర్లకు, లేనివారికంటే 56% అదనపు వేతనం లభిస్తోందని లింక్డిన్ 2026 వర్క్‌ఫోర్స్ నివేదిక చెబుతోంది. గ్రాడ్యుయేట్లకు ఇప్పుడు డిగ్రీ ఒక్కటే సరిపోదు; వారు ఏఐ ఏజెంట్లను నడిపించే 'ఆర్కెస్ట్రేటర్స్' గా మారాల్సి ఉంది. ఇది మధ్యతరగతి కుటుంబాలకు తీరని భారం అవుతోంది. కేవలం పుస్తక జ్ఞానంతో నెట్టుకొచ్చే కాలం ముగిసిందని గ్రహించాలి.

మనం కేవలం ఉద్యోగాలను కోల్పోవడం లేదు, నైపుణ్యాన్ని నిర్మించే ఒక పురాతన వ్యవస్థను కోల్పోతున్నాం. కార్పొరేట్ సంస్థలు తక్షణ లాభాల కోసం జూనియర్ నియామకాలను తగ్గిస్తే, రాబోయే ఐదు పదేళ్లలో ఒక పెద్ద 'నైపుణ్య శూన్యం' (Competency Gap) ఏర్పడే ప్రమాదం ఉంది. 2026లో నిలబడి మనం అడగాల్సిన ప్రశ్న "ఏఐ మన ఉద్యోగాలను తీసేస్తుందా?" అని కాదు, "అనుభవం లేని యువత అనుభవాన్ని ఎలా సంపాదిస్తుంది?" అని. విద్యా వ్యవస్థ, పరిశ్రమల మధ్య ఉన్న ఈ అంతరాన్ని పూడ్చకపోతే, భవిష్యత్తులో మన దగ్గర తెలివైన యంత్రాలు ఉంటాయి కానీ, వాటిని నైతికంగా, సృజనాత్మకంగా నడిపించే తెలివైన మనుషులు ఉండకపోవచ్చు.

నవతరం యువత కేవలం డిగ్రీలతో సరిపెట్టుకోకుండా, యంత్రాలు చేయలేని 'విమర్శనాత్మక ఆలోచన' (Critical Thinking) మరియు సామాజిక అవగాహనలో ప్రావీణ్యం సంపాదించడమే ఇప్పుడున్న ఏకైక రక్షణ కవచం. ప్రభుత్వం, పరిశ్రమలు కలిసి ఈ 'ల్యాడర్' మళ్ళీ నిర్మించకపోతే సంక్షోభం మరింత ముదురు తుంది. నిరంతరం నేర్చుకోవడం, సాంకేతికతతో కలిసి ప్రయాణించడమే ప్రస్తుత యువత ముందున్న ఏకైక కర్తవ్యం..!



- తుమ్మల బాల గంగాధర్ తిలక్



అంగన్‌వాడీ కేంద్రాలకి పరికరాలను అందజేస్తున్న సోమిరెడ్డి, కృష్ణ ఆయిల్ అండ్ ఫాట్స్ ప్రతినిధులు

## గిరిజన బిడ్డలకు సాయం..మరువలేనిది!

### సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

పీ4లో భాగంగా సీఎస్ఆర్ నిధులతో సహకరిస్తున్న ప్రతి కంపెనీకి రుణపడి ఉంటామని, వారు గిరిజన బిడ్డలకు చేస్తున్న సాయం మరువలేనిది మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన మనుబోలులో అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తువులు పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడుతూ, సుమారు రూ. 31.40 లక్షలతో సౌత్ ఇండియా కృష్ణ ఆయిల్ అండ్ ఫాట్స్ కంపెనీ వారు ఎస్టీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన పరికరాలు అందించడం అభినందనీయమన్నారు. ఆ కంపెనీ ఆధ్వర్యంలో మనుబోలు, పొదలకూరు, వెంకటాచలం మండలాల్లోని ఎస్టీ కాలనీల 69 అంగన్ వాడీ కేంద్రాలకు అవసరమైన వస్తువులను పంపిణీ చేస్తున్నామని, ఒక్కో అంగన్ వాడీ కేంద్రానికి రూ. 26,500 విలువైన వస్తువులను ఇస్తున్నామని తెలిపారు. టీవీలు, గ్యాస్‌స్టవ్‌లు, కుక్కర్లు, కుర్చీలు, ఆట వస్తువులు, మ్యాట్లు, ప్లేట్లు, గ్లాసులు, స్పూన్లు తదితరాలన్నీ ఆ కేంద్రాలకి అందజేస్తున్నామన్నారు. వాటిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా, పోషణ్‌పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే సెయిల్ కంపెనీతో పాటు పామాయిల్ కంపెనీలన్నీ ఒక్కో గిరిజన కాలనీని దత్తత తీసుకున్నాయని, కోట్లాది రూపాయల నిధులతో సెయిల్ కంపెనీ అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. అదానీ కృష్ణపట్నం పోర్టు కూడా మేజర్ పంచాయతీలైన ముత్తుకూరు, కృష్ణపట్నం ప్రాంతాలను దత్తత తీసుకుందని, ఆ గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అన్ని వసతులు కల్పించడంపై అదానీ ఫౌండేషన్ ప్రత్యేకదృష్టి పెట్టిందని వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల కోసం అమలవతున్న కేంద్ర ప్రభుత్వ పథకాలను మన ప్రాంతంలోని చల్లా యానాదుల కోసం అమలు చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాన్ని పార్లమెంటులోనూ ప్రస్తావించాలని మన ఎంపీలను కోరగా, వారు సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

## యాచకులకు మంచిరోజులు

### నెల్లూరులో పునరావాస కేంద్రం



పునరావాస కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

పరిస్థితుల ప్రభావం, అనివార్య కారణాలతో అనేకమంది యాచక వృత్తిపై ఆధారపడుతున్న నేపథ్యంలో, అలాంటి వారిని ఆదుకునేందుకు నెల్లూరులో ఓ పునరావాస కేంద్రాన్ని జిల్లా అధికారులు ఏర్పాటుచేశారు. ఎ.ఆర్.డి సంస్థ మునిసిపల్ కార్పోరేషన్ సౌజన్యంతో స్థానిక 38వ డివిజన్‌లో 'స్మైల్ ' (సపోర్ట్ ఫర్ మార్జినలైజ్డ్ ఇండివిద్యువల్స్ ఫర్ లైవ్‌లిహుడ్ అండ్ ఎంపవర్‌మెంట్) పేరుతో ఏర్పాటుచేసిన ఆ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, టీడీపీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలసి సోమవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడతూ యాచక వృత్తిలో ఉన్న వారిని గుర్తించి పునరావాస కేంద్రానికి చేర్చి వారికి అవసరమైన ప్రథమ చికిత్స చేయడం జరుగుతుందన్నారు. వారికి భోజన వసతి, నివాస సదుపాయంతో పాటు వారు మంచి జీవనం గడిపేందుకు వసరమైన సాయంతో పాటు కౌన్సిలింగ్ ఉంటుందన్నారు. తొలిసారిగా జిల్లా ప్రధాన కేంద్రంలో ఈ పునరావాస కేంద్రం ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. సిబ్బంది జీతభత్యాలు, మౌలిక వసతుల ఏర్పాటు, భోజన వసతికి సంవత్సరానికి సుమారు 54 లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ద్వారా అందించడం జరుగుతుందన్నారు. బిక్షాటన నిర్మూలనకు పునరావాస కేంద్రాలు ఉపయోగపడతాయన్నారు. వారిలో ఆత్మాగౌరవం నింపి నైపుణ్యతా శిక్షణను ఇవ్వడం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ నందన్, ఎ.ఆర్.డి సంస్థ ప్రతినిధి బషీర్, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లును వ్యతిరేకించడం దారుణం

### • కాంగ్రెస్ - మిత్రపక్షాలపై బీజేపీ నేతల మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న పి.సురేంద్రరెడ్డి

మహిళా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ వారి మిత్రపక్షాలు వ్యవహరించిన తీరును తెలియజేస్తూ ప్రధాని 2023లో తీసుకొచ్చిన 33శాతం మహిళ బిల్లును ఈ నెలలో ప్రవేశపెడితే, కాంగ్రెస్–మిత్ర పక్షాలు వ్యతిరేకించడం దారుణమని బీజేపీ మహిళామోర్చా నాయకురాలు చిలకల ప్రవీణారెడ్డి, మహిళా మోర్చా ఇన్‌చార్జి–బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సురేంద్రరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 21న నెల్లూరులోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మహిళామోర్చా అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, రాజకీయాల్లో మహిళల ప్రాముఖ్యతను పెంచేందుకు ప్రధాని మోడీ చేస్తున్న కృషిని, కాంగ్రెస్–మిత్రపక్షాలు భగ్నం చేయడానికి ప్రయత్నించడం విచారకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌తో పాటు పక్కాగా సెన్సెస్ తీసి డీలిమిటేషన్‌చేసి, పరిపాలన సౌలభ్యం కోసం, వ్యవస్థలో మార్పు తీసుకురావడం కోసం రాజకీయ పార్టీలందరినీ ఒప్పించిందన్నారు. చట్టసభలలో మహిళలు ప్రాతినిధ్యం వహిస్తే దేశానికి ఎంతో మేలని రాజ్యాంగ సవరణ చేసే బిల్లును ప్రవేశపెడితే, కాంగ్రెస్ వారి మిత్రపక్షాలు వ్యతిరేకించడం వాళ్లకి స్త్రీల పట్ల ఉండే ద్వేషాన్ని, వ్యతిరేకతను చట్టసభల ద్వారా బయట పెట్టుకున్నట్లయిందని విమర్శించారు. గతంలో వాజ్‌పాయ్ హయాంలో కూడా నాలుగు పర్యాయాలు మహిళా బిల్లును ప్రవేశపెడితే కాంగ్రెస్ వారి మిత్రపక్షాలు వ్యతిరేకించారని ఆ ప్రతులను కూడా చించేశారని వారు గుర్తుచేశారు. ప్రధాని మోడీ అందరినీ ఒప్పించి మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఉండాలని కోరుకుంటూ అన్ని రాష్ట్రాలకు ప్రాముఖ్యత ఇవ్వడం జరిగిందని తెలిపారు. దేశంలో లక్షలాదిమంది మహిళలు పంచాయతీ రాజ్ వ్యవస్థలో చక్కగా పనిచేస్తున్నారని, మహిళలు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించారని వాటిని అభివృద్ధిపథంలో నడిపించారని అన్నారు. నేడు దేశంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని, వారి శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారని వారిని కూడా కలుపుకొని సమాన అవకాశాలు ఇవ్వాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ మరియు ఎన్డీఏ కూటమి ఆ బిల్లును ప్రవేశపెట్టిందని వారన్నారు. దానిని కాంగ్రెస్ మిత్ర పక్షాలు వ్యతిరేకించిన తీరు పూర్తిగా అప్రజాస్వామికమని వారు దుయ్యబట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని, ఆ బిల్లు రావాలని పార్లమెంట్ సభ్యులందరిపై ఒత్తిడి తీసుకురావాలని వారు సూచించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాళ్ళు సుభాషిణి, ప్రసన్నమ్మ, నాగలక్ష్మి, కవిత, కారుణ్య, స్వర్ణ, రమణమ్మ, లక్ష్మీ కుమారి, పావన పార్వతి, విజయశ్రీ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల కష్టాలు తీర్చాలి

### • అపస్మా రాష్ట్ర మహాసభల్లో వక్తలు



ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని సత్కరిస్తున్న అపస్మా సభ్యులు

రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాలలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాయని, ప్రభుత్వం స్పందించి ఆ కష్టాలు తీర్చాలని వక్తలు కోరారు. ఈనెల 20న నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో జరిగిన అపస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్–ఏపీపీయుఎస్ఎంఏ) 12వ రాష్ట్రమహాసభలు జరిగాయి. ఆ సంఘం రాష్ట్ర సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు నేలనూతల శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఎంఎల్‌సీలు ఎం.వి రామచంద్రరెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొని ప్రైవేటు పాఠశాలల సమస్యలను చర్చించారు. నేతాజీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో అతితక్కువ ఫీజుతో ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 57 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, అనేక సమస్యలతో వారు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలను ఒక పరిశ్రమగా గుర్తించాలని, ఈ స్కూళ్ళలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇళ్లప్లాట్లను, లేదా టిడ్కో ఇళ్ళను కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో కార్పొరేట్ విద్యా వ్యవస్థ వల్ల బడ్జెట్ పాఠశాలలు ఇబ్బందులు పడుతున్నాయని, వారి సమస్యలను తమకు తెలియజేస్తే, అసెంబ్లీ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు కూడా ఇదేవిధంగా వారి సమస్యలు తీర్చేందుకు ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. అపస్మా రాష్ట్ర నాయకులు వి.జనార్దన్‌రెడ్డి, ఏ.కృష్ణారెడ్డి, జెఎస్‌పీ బాలాజీ, పివి రమణారెడ్డి, ఎస్.శ్రీనివాసరావు, ఎంబిఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా నాయకులు రామమోహన్‌రెడ్డి, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

### వ్యవసాయ కార్మికుల సంఘం నాయకుల డిమాండ్

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీల సమస్యలను ప్రభుత్వం వెంటనే పట్టించుకుని, వారి కష్టాలు తీర్చాలని కావలిలోని వ్యవసాయ కార్మికసంఘం నాయకులు టి.మాల్యాద్రి రాధాక్రిష్టయ్య, సీతారామయ్యలు డిమాండ్ చేశారు. ఈనెల 21న వారు కావలి మండలంలోని రాజువారిచింతలపాళెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న చోటికి వెళ్ళి, అక్కడ ఉపాధి కూలీల బాధలను అడిగి తెలుసుకున్నారు. కూలీలు తాము పడుతున్న బాధలను వారికి తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, కూలీలు పనిచేసే ప్రాంతాల్లో ఈ మండువేసవిలో కనీసం మంచినీళ్ళు కూడా అందుబాటులో లేవన్నారు. ఉదయాన పనికి వెళ్ళేముందు ఫేస్ యాప్, పని అయిపోయిన తర్వాత ఫేస్ యాప్, ఫోటోలు తీసుకుంటున్నారని, అయితే గతంలో పనిచేసినప్పుడు ఇవ్వాల్సిన కూలీ మొత్తాలను నేటికీ చెల్లించకపోవడం దారుణమన్నారు. పే–స్లిప్‌లు కూడా ఇంకా ఇవ్వలేదన్నారు. అంతేకాదు, ఈ ఎండల్లో నీడ కోసం చలువపందిళ్ళు లేదా టెంట్‌లు కూడా ఎక్కడా కనిపించడం లేదని తెలిపారు. తామున్న ప్రాంతాలనుంచి ఉపాధి పనులు చేసే ప్రాంతానికి 3 కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ, నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన ఆటోచార్జీలు ఇవ్వడం లేదన్నారు. రెండుపూటలా ఫేస్‌యాప్‌లతోనే పుణ్యకాలం కాస్తా గడిచిపోతోందని, కనీస వేతనాలు కానీ, ఇవ్వాల్సిన బకాయిల చెల్లించడంగానీ చెయ్యడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టిపెట్టి, ఉపాధి హామీ కూలీలను ఆదుకోవాలని వారు కోరారు.

# నెల్లూరు కబుర్లు

## జెఇఇ మెయిన్ ఫలితాల్లో..
# విశ్వసాయి విజయాలు


ఉత్తమ ర్యాంకులు పొందిన విద్యార్థినీవిద్యార్థులతో కళాశాల ఛైర్మెన్ సత్యనారాయణ

ఇటీవల ప్రకటించిన జెఇఇ మెయిన్ సెషన్-2 ఫలితాలలో విశ్వసాయి జూనియర్ కళాశాలకి చెందిన విద్యార్థులు ఇప్పటికి 60 మందికిపైగా జాతీయస్థాయిలో ఎన్నికయ్యారని, వీరు జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారని ఆ కళాశాల ఛైర్మెన్ డా.యన్.సత్యనారాయణ మరియు డైరెక్టర్ శివసంకేత్‌లు తెలిపారు. నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని విశ్వసాయి కళాశాలలో ఇటీవల ఏర్పాటుచేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ, జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఆ విద్యార్థుల వివరాలను తెలిపారు. బి.మహేష్ జాతీయ స్థాయిలో 228వ ర్యాంకు సాధించాడని, అదేవిధంగా బి.సంతోష్ 346వ ర్యాంకు, ఇ.దినేష్ 1938వ ర్యాంకు, సీహెచ్ పావని 1995వ ర్యాంకు, బి.పవిత్ర 9009వ ర్యాంకు, ముని పృథ్వీ 9149వ ర్యాంకు సాధించారని వారు సంతోషం వ్యక్తం చేశారు. వీరంతా మే నెలలో జరగబోయే జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో కూడా చక్కని ప్రతిభ కనపరుస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థుల కృషి, అధ్యాపకుల పర్యవేక్షణ ఈ విజయాలకు కారణమని వారు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. కళాశాల డైరెక్టర్ జి.కృష్ణమోహన్ మరియు ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. క్రమశిక్షణ, సీనియర్ అధ్యాపకులచే విద్యాబోధన పర్యవేక్షణ వల్ల తాము ఈ విజయాలు సాధించగలిగామని వారందరికీ తమ కృతజ్ఞతలు తెలిపారు.

# 'అరసం' ఆధ్వర్యంలో..పుస్తక పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న 'అరసం' సభ్యులు

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనుబంధ సంస్థ-గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక-నెల్లూరుజిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల విద్యార్థులకు రకరకాల పుస్తకాలను ఉచితంగా అందజేశారు. నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ వెంకటేశ్వర విద్యాలయం ఉన్నత పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు 12 రకాల పాఠ్యేతర పుస్తకాలను అందజేశారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామని ఆ వేదిక జిల్లా కన్వీనర్ పెరుగు రామకృష్ణ కోరారు. అరసం జిల్లా అధ్యక్షులు గంగిశెట్టి శివకుమార్, ప్రధాన కార్యదర్శి కరుణశ్రీ, కథారచయిత పొట్లూరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ ఉద్యోగులకు చీకటి రోజులు!
## కూటమి పాలనపై ఎమ్మెల్సీ పర్వతరెడ్డి ధ్వజం



చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పాలన ప్రభుత్వ ఉద్యోగులకు చీకటి రోజులుగా మారిందని, హామీలు అమలు చేయకుండా రెండేళ్లుగా చుక్కలు చూపించడమే కాకుండా, వాటి గురించి ప్రశ్నిస్తున్న వారిని కేసులతో చంద్రబాబు వేధిస్తున్నారని వైయస్సార్సీపీ నేత, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ధ్వజమెత్తారు. ఈనెల 21న ఆయన నెల్లూరులోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేసిన కాకర్ల వెంకట్రామిరెడ్డిని డిస్మిస్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి పరాకాష్ట అని చెప్పారు. ఉద్యోగులంతా ఆయనకు అండగా నిలబడి ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో రెండేళ్లుగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని అక్రమంగా అరెస్ట్ చేసి తప్పుడు కేసులతో నిర్బంధించే సంస్కృతిని కొనసాగిస్తున్నారని విమర్శించారు.

# 'కళారత్న' అవార్డు..స్ఫూర్తినిచ్చింది
## - ప్రముఖ కవి చిన్ని నారాయణరావు -


చిన్ని నారాయణరావుని సత్కరిస్తున్న కవులు, కవయిత్రులు

ఉగాది సందర్భంగా రాష్ట్రప్రభుత్వం తనకు 'కళారత్న' అవార్డు నందజేయడం తనకెంతో స్ఫూర్తినిచ్చిందని ప్రముఖ కవి చిన్ని నారాయణరావు చెప్పారు. ఆ విశిష్ట అవార్డునందుకున్న ఆయన్ను నెల్లూరులోని పలు కళాసంఘాలు, కవులు ఈనెల 19న అభినందించారు నెల్లూరులోని హోటల్ అతిథిలో చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, పెరసం సారథ్యంలో జరిగిన 'యుద్ధం ఒక గుండెకోత' అనే అంశంపై జరిగిన కవిసమ్మేళనంలో ఆయన్ను సన్మానించారు. ప్రముఖ కవి, ఉపన్యాసకుడు గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ, చిన్ని నారాయణరావు తన కవిత్వాన్ని వామనుడిలా విశ్వవ్యాపితం చేస్తున్నారని ప్రశంసించారు. అనంతరం యుద్ధం ముగియాలని-శాంతి వెల్లివిరియాలని కోరుకుంటూ కవులు, కవయిత్రులు తమ కవితలు వినిపించారు. కేంద్ర సాహిత్య అకాడెమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డా. గంగిశెట్టి శివకుమార్, అవ్వారు శ్రీధరబాబు, పాతూరి అన్నపూర్ణ, గోవిందరాజు సుభద్రాదేవి, తోట సులోచన, నాగేశ్వరమ్మ, అంకబాబు, రమేష్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# 29న..జిల్లాస్థాయి చెస్ ఎంపికలు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు చెస్ అసోసియేషన్ మరియు ఏబీసీ చెస్ ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన జిల్లాస్థాయి అండర్-13 బాలుర మరియు బాలికల చెస్ ఛాంపియన్‌షిప్-2026 మరియు ఎంపికలు జరుగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్‌కు నెల్లూరులోని ధనలక్ష్మీపురంలో ఉన్న రెయిన్‌బో స్కూల్ వేదికగా నిలవడమే కాకుండా, ప్రధాన స్పాన్సర్‌గా కూడా వ్యవహరిస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు తేది 1.1.2013 తరువాత జన్మించి ఉండాలని, సరైన జనన ధృవీకరణ పత్రాలు కలిగిన క్రీడాకారులు ఏప్రిల్ 27వతేదీ లోపు నిర్వాహకుల ఫోన్ నంబర్ 8096328326, 9603345326లను సంప్రదించి తమ పేరును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ పోటీలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సైకిళ్లు, ఆకర్షణీయమైన ట్రోఫీలను బహుమతిగా ప్రదానం చేస్తామని, మొదటి రెండు స్థానాలు సాధించిన క్రీడా కారులు రాష్ట్రస్థాయి అండర్-13 చెస్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధిస్తారని వివరించారు. జిల్లాలోని చెస్ క్రీడాకారులందరూ ఈ గొప్ప అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు.

## సీబీఎస్ఇలో..
# సత్తాచాటిన 'రెయిన్‌బో'


ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం

ఇటీవల ప్రకటించిన సీబీఎస్ఇ 2025-26 పదవతరగతి ఫలితాల్లో నెల్లూరు రూరల్ మండలం కలివెలపాళెంలోని రెయిన్‌బో సీబీఎస్ఇ స్కూల్ విద్యార్థులు తమ సత్తాచాటారు. ఈ స్కూల్ స్థాయిలో విద్యార్థిని సాచీజైన్ 492 మార్కుల్తో స్కూల్ స్థాయిలో ప్రథమస్థానం సాధించగా, జి.వీక్షాచౌదరి 491 మార్కులతో ద్వితీయస్థానం సాధించింది. 489 మార్కులతో పి.హంసిని తృతీయ స్థానం, 488 మార్కులతో వై.లేఖన 4వ స్థానం, 484 మార్కులతో ఎం.అంజనా రిషిత్ 5వ స్థానం కైవసం చేసుకున్నారని పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అనిగోపకుమార్‌లు సంతోషం వ్యక్తం చేశారు. పరీక్షలకు హాజరైన 97 మంది విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని, వారిలో 61 మంది 80 శాతం పైగానే ఉత్తమశ్రేణిలో మార్కులు పొందారని వారు తెలిపారు. విద్యార్థులు ఈ విజయం సాధించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులను, తల్లితండ్రులను వారు ఈ సందర్భంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్స్ అరుణాస్వయంప్రభ, బింద్యాజీనా, వైస్ ప్రిన్సిపాల్ సురేఖారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 26న..'కళాంజలి' 38వ వార్షికోత్సవం

నెల్లూరులోని 'కళాంజలి' సాంస్కృతిక సంస్థ 38వ వార్షికోత్సవం ఈనెల 26వ తేదీ ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు స్థానిక టౌన్‌హాలులో జరుగుతుందని ఆ సంస్థ వ్యవస్థాపకులు 'కళాంజలి' అనంత్, ఆర్గనైజర్ దువ్వూరు బెనర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నాట్య గురువు, స్థానిక గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభి గాయత్రికి కళాంజలి పురస్కారం ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి 'లాయర్' పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, రెడ్‌క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, విశ్వసాయి విద్యాసంస్థల ఛైర్మెన్ డా. ఎన్.సత్యనారాయణ, కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, శుభమస్తు షాపింగ్‌మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు-బయ్యా రవికుమార్, వాకర్స్ 203 డిస్ట్రిక్ట్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, ప్రముఖ వైద్యులు డా. అజయ్‌కుమార్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రపంచ నృత్యదినోత్సవాన్ని పురస్కరించుకుని శాస్త్రీయ-జానపద-సినీ నృత్యహేల నిర్వహిస్తామని, కళాకారులు, కళాభిమానులందరూ తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు.

# పరిశోధకుల దిక్సూచీ.. ఎన్నెస్కే


సి.రాధాకృష్ణని సత్కరిస్తున్న నిర్వాహకులు

చరిత్ర, సాహిత్యం, నాట్యశాస్త్రం, శిల్పశాస్త్రం తదితరాల్లో అసామాన్య ప్రతిభ కలిగిన నేలనూతల శ్రీకృష్ణమూర్తి(ఎన్నెస్కే) పరిశోధకులకు మార్గదర్శకులని నెల్లూరు విఆర్‌సీ విశ్రాంత చరిత్ర-రాజనీతిశాస్త్ర విభాగాధి పతి సి.రాధాకృష్ణ చెప్పారు. నెల్లూరు వర్ధమాన సమాజం ఆధ్వర్యంలో, ఇటీవల టౌన్‌హాలు రీడింగ్‌రూమ్‌లో జరిగిన 'నేలనూతల శ్రీకృష్ణమూర్తి 20వ స్మారకోపన్యాసం'లో ఆయన పాల్గొని ఎన్నెస్కే ప్రతిభావిశేషాలను వివరించారు. పరిశోధకులకు ఒక దిక్సూచీగా ఎన్నెస్కే రాణించారని ఆయన కొనియాడారు. అనంతరం నిర్వాహకులు సి.రాధాకృష్ణను సన్మానించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కో-ఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు సభకు అధ్యక్షత వహించారు. వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకరరెడ్డి, కార్యవర్గసభ్యులు.. విఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్స్ డా. ఎం.సుబ్రహ్మణ్యం, డా. పి.రాధిక, పి.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేవా సంబరంగా..

# విపిఆర్ పుట్టినరోజు!

**• వెల్లివిరిసిన సేవాభావం.. ఆడపడుచులకు సారె అందించిన వేమిరెడ్డి దంపతులు**

మహాదాత..జిల్లా అభివృద్ధి సాధకులు..సామాజిక–ఆధ్యాత్మిక 'సేవాభూషణులు'..నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 70వ పుట్టినరోజు పండుగ ఈనెల 19న సేవా సంబరంగా జరిగింది. పలుచోట్ల కేక్‌లు కట్‌చేసి ఆయనకి బర్త్‌డే శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు అనేక ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నెల్లూరు, కోవూరు తదితర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, నాయకులు, అభిమానులు నెల్లూరులోని వారి నివాసానికి, కార్యాలయానికి వచ్చి విపిఆర్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తన పుట్టినరోజున వేమిరెడ్డి... ఆయన సతీమణి.. కోవూరు శాసనసభ్యురాలు ప్రశాంతిరెడ్డిలు స్వయంగా పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

### మహిళా ఉద్యోగినుల సంబరాలు

నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో జరిగిన వేడుకకు కోవూరు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న వేలాదిమంది మహిళా ఉద్యోగినులు తరలివచ్చి విపిఆర్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రతి మహిళా ఉద్యోగినికి 'సారె' అందజేసి తన సోదరభావం చాటుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తాను రాజకీయాల్లోకి వచ్చాక తన పుట్టినరోజును ఇంతమంది అక్కచెల్లెళ్ల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు.

### గిరిజన విద్యార్థులకు క్రీడా కిట్‌లు

ఇందుకూరుపేట గిరిజన విద్యార్థులకు టీషర్ట్స్, ప్యాంట్స్, షూస్ తదితరాలతో విలువైన క్రీడా కిట్లు అందించి వేమిరెడ్డి దంపతులు తమ సేవాభావం చాటుకున్నారు. వారితో సరదాగా కొద్దిసేపు గడిపి ఆటోగ్రాఫ్‌లు ఇచ్చారు.

### మహిళలకు కుట్టుమిషన్లు

నెల్లూరులోని తమ కొత్త క్యాంప్ కార్యాలయంలో వేమిరెడ్డి దంపతులు కోవూరు నియోజకవర్గంలోని 110 మంది మహిళలకు కుట్టుమిషన్‌లు పంపిణీ చేశారు. మరో 17 మందికి జీవనోపాధి నిమిత్తం తోపుడు బండ్లు అందజేశారు. బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు వేమిరెడ్డి దంపతులు బహుమతులిచ్చారు.


గిరిజన విద్యార్థులకి ఆటోగ్రాఫ్‌లిస్తున్న వేమిరెడ్డి దంపతులు


మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న విపిఆర్



మహిళా ఉద్యోగినులకి సారెను అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు

### రక్తదాన శిబిరం



విపిఆర్ జన్మదినోత్సవం రోజున జనసేన నాయకులు హరికుమార్‌రెడ్డి, వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు జి.పి.ఆర్ కళ్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వేమిరెడ్డి దంపతులు ప్రారంభించారు. ఈ శిబిరంలో రక్తదానం చేసిన సుమారు 300 మందికి పైగా రక్తదాతలను, శిబిర నిర్వాహకులను వారు కొనియాడారు.








## స్మృత్యంజలి

మానవతామూర్తి, సేవాదీప్తి
మాకందరికీ స్ఫూర్తి, మా కుటుంబ కీర్తి

**చిల్లకూరు రాధాకృష్ణారెడ్డి గారు**

(డాక్టర్ సి.ఆర్.రెడ్డి)

పరమపదించి తేది.24.4.2026 నాటికి మూడేళ్ళు గడిచాయి.

**ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...**

తమ్ముడు - మరదలు
**ఆచార్య సి.యం.కె.రెడ్డి - శ్రీమతి నిర్మల, చెన్నై**

తమ్ముని కుమారుడు - కోడలు
**డా॥ సి.యం.కిషోర్ - శ్రీమతి లీలాదేవి, చెన్నై**

తమ్ముని కుమార్తె - అల్లుడు
**శ్రీమతి హరిత - డా॥ రామానందరెడ్డి, కాకినాడ**

తమ్ముని మనుమలు.. మనుమరాండ్రు
**జయేష్ & అష్మిత - ఆకాష్ కీర్తన లక్ష్మి & తనవ్**

జననం : 01.03.1929 నిర్యాణం : 24.04.2023

### నెల్లూరు 'అపోలో'లో..

# లివర్ స్క్రీనింగ్‌కి కొత్త ప్యాకేజీ

## 4వేల విలువచేసే పరీక్షలు 1,999 రూపాయలకే




లివర్ స్క్రీనింగ్ బ్రోచర్‌ని ఆవిష్కరిస్తున్న అపోలో వైద్య బృందం

నెల్లూరు 'అపోలో' సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో లివర్ స్క్రీనింగ్‌కి కొత్త ప్యాకేజీ ప్రకటించారు. దాదాపు 4వేల రూపాయల విలువైన ఈ పరీక్షలను కేవలం 1999 రూపాయలకే అందించనున్నారు. ఈనెల 19న ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల స్థానిక అపోలో హాస్పిటల్‌లో గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ హిమబిందు, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు డాక్టర్ ద్వారకానాథ్‌రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ఫ్యాటీ లివర్(కాలేయంలో కొవ్వు చేరడం) అనేది ప్రాథమిక దశలో అంత ప్రమాదకరం అనిపించకపోయినా, నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారితీస్తుందని, ప్రారంభ దశలోనే దీనిని గుర్తిస్తే ఆ వ్యాధులను నివారించడం సులభమని తెలిపారు. ముందస్తు స్క్రీనింగ్ పరీక్షలతోనే అది సాధ్యమన్నారు. అందుకోసం, అపోలో సంస్థ ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టిందన్నారు. 4,400 విలువైన లివర్ స్క్రీనింగ్ పరీక్షలను కేవలం 1,999 రూపాయలకే చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్యాకేజీ మే నెల 18వ తేదీ వరకూ కొనసాగుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ డాక్టర్ బిందు భార్గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో..చలివేంద్రలు




ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు నగరంలో ఈనెల 17న పలుచోట్ల చలివేంద్రలు ఏర్పాటుచేశారు. ఈ మండేవేసవిలో ప్రజలు దాహార్తితో ఇబ్బందిపడకుండా, వారికి చల్లని నీటిని అందించాలనే ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆదేశాల మేరకు జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ ఛైర్మెన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి సూచనలతో, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కో–ఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటుచేశారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండు, క్యాన్సర్ హాస్పిటల్ సెంటర్, మరియు ముత్తుకూరు గేట్ ఫ్లైఓవర్ క్రిందిభాగంలో ఈ ఉచిత త్రాగునీటి చలివేంద్రాలను దాతల సహాయసహకారాలతో నెలకొల్పారు. క్యాన్సర్ హాస్పిటల్ కో–ఆర్డినేటర్ రంగయ్య నాయుడు మాట్లాడుతూ రోజుకి కనీసం పదివేల మంది దాహార్తిని తీరుస్తూ 60 కూలింగ్ వాటర్ క్యాన్లతో చలివేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందని, ఈ అవకాశాన్ని ఈ ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు. రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ కో–ఆర్డినేటర్ బయ్యా ప్రసాద్, రెడ్ క్రాస్ సభ్యులు జె.వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# 24 నుంచి..రామాయణ ప్రవచనాలు

నెల్లూరులోని పద్య సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో, రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి హృదానందజీ మహరాజ్ ఆశీస్సులతో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ప్రముఖ కవిపండితుల నేతృత్వంలో 'రామాయణం'పై ప్రవచనాలు జరుగనున్నాయి. స్థానిక 3వ మైలు, నవలాకులతోటలోని రామకృష్ణమిషన్ ప్రాంగణంలో ప్రతిరోజు సాయంత్రం 5 నుండి 6.30 గంటల వరకు జరిగే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా, తొలిరోజు 24న డా. డాక్టర్ అయినవోలు శ్రీనివాస చక్రపాణి రామాయణం లోని 'బాలకాండం'పై ఉపన్యసిస్తారు. అదేవిధంగా, 25న పోలవరపు లక్ష్మీనరసింహారావు 'అయోధ్యకాండ', 26న ఇనమనమెళ్ళూరు నాగరాజారావు 'అరణ్యకాండ', 27న అగస్త్యరాజు సుబ్బారావు 'కిష్కింధకాండ', 28న డా.చీమకుర్తి వేంకటేశ్వరరావు 'సుందరకాండ', 29న శతావధాని కొండెపి మురళీకృష్ణ 'యుద్ధకాండ', 30న డా.కె గిరిజాలక్ష్మి 'ఉత్తరకాండ'లపై ప్రసంగిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ ఛైర్మెన్ నలుబోలు బలరామయ్యనాయుడు, తుర్లపాటి లక్ష్మీనారాయణరావు (రామకృష్ణమిషన్) తదితరులు పాల్గొంటారని, పద్యసారస్వత పరిషత్, రామకృష్ణమిషన్ సభ్యులతో పాటు, భక్తులు–సాహిత్యాభిమానులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

### నిర్మాణ రంగ కార్మికులకు..

# సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ ద్వారా నమోదు చేసుకున్న భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల కోసం నాలుగు సంక్షేమ పథకాలను ఈ ఏడాది మార్చి నెల 1వ తేదీ నుండి పునరుద్ధరించినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించిన పథకాల ద్వారా అందించే సహాయాన్ని ఆయన వివరించారు. 1. వివాహ కానుక: నిర్మాణ రంగంలో నమోదు అయిన మహిళా కార్మికులకు మరియు కార్మికుల ఇద్దరు ఆడపిల్లల వివాహాలకు రూ. 20,000 వరకు ఆర్థిక సహాయం. 2. ప్రసూతి సాయం : నమోదైన మహిళా కార్మికులు, కార్మికుని భార్య మరియు కార్మికుల ఇద్దరు పిల్లలకు..ప్రసవం అనంతరం వైద్య ఖర్చులు, పోషణ అవసరాల కోసం రూ.20,000 వరకు ఆర్థిక సహాయం. 3. సహజ మరణం: నమోదైన కార్మికుడు ఒకవేళ సహజ మరణం చెందిన సందర్భంలో కుటుంబ సభ్యులకు భరోసాగా రూ. 60,000 వరకు ఆర్థిక సహాయం. 4.దహన ఖర్చులు : మరణించిన కార్మికుల కుటుంబాలకు మృతుని దహన ఖర్చుల నిమిత్తం రూ.20,000 వరకు ఆర్థిక సహాయం అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. కనుక, జిల్లాలో ఇంకా నమోదు కాని భవన నిర్మాణ రంగ కార్మికులు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించి 110 రూపాయలు చెల్లించి వెంటనే తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే ఇప్పటికే నమోదైన కార్మికులు ప్రతి 5 సంవత్సరాలకు రూ.60 చెల్లించి రెన్యూవల్ చేసుకొని ప్రభుత్వం పునరుద్ధరించిన ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని ఆయన కోరారు.

### కామాక్షితాయి అమ్మవారికి..

# వెండిపట్టీల బహుకరణ



వెండి పట్టీలు సమర్పిస్తున్న కుష్వంత్‌కుమార్

జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవాలయంలో అమ్మవారి అలంకరణ నిమిత్తం సింగరాయకొండకు చెందిన దంపూరి కుష్వంత్‌కుమార్ ఇటీవల 234 గ్రాముల వెండి పట్టీలు సమర్పించారు. ఆలయ ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ఇఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీరువా వితరణ :

నెల్లూరు వాస్తవ్యులు పీవీ సురేష్‌బాబు అమ్మవారికి జరిగే సామూహిక కుంకుమార్చన పూజలకి సంబంధించిన సామాగ్రిని భద్రంగా పెట్టుకునేందుకు అయిదున్నర అడుగుల బీరువాను ఇటీవల ఆలయం వారికి సమర్పించారు.



# సరైన పద్ధతిలో చదువుకుంటేనే.. పరీక్షల్లో విజయం

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

పరీక్షలు దగ్గరపడుతున్నప్పుడు విద్యార్థుల మనసులో మొదట పుట్టేది భయం కాదు, గందరగోళం. "ఎలా చదవాలి?", "ఎంత చదవాలి?", 'ఏది ముఖ్యమో ఎలా తెలుసుకోవాలి?' అనే సందేహాలు ప్రతి విద్యార్థి మనసులో తిరుగుతూనే ఉంటాయి. చాలామంది విద్యార్థులు కష్టపడి చదవడమే విజయానికి మార్గమని నమ్ముతారు. గంటల తరబడి పుస్తకాల ముందు కూర్చోవడం, రాత్రిళ్లు నిద్రపోకుండా చదవడం, పేజీలను కంఠస్థం చేయడం, ఇవన్నీ కష్టపడిచదవడమే. కానీ కష్టం మాత్రమే విజయం ఇవ్వదు. కేవలం గంటల తరబడి బట్టీయం పట్టినంతమాత్రాన ప్రయోజనం ఉండదు. సరైన దిశలో కష్టపడి చదువుకుంటేనే ఫలితం వస్తుంది. దిశ తప్పితే కష్టం కూడా వృథా. పరీక్షలకు సరైన ప్రణాళికలతో, తెలివిగా సిద్ధం కావడం వల్లనే ఎప్పుడూ మెరుగైన ఫలితాలు వస్తాయి.

## తెలివిగా సిద్ధం కావడం అంటే ఏమిటి?:

తెలివిగా సిద్ధం కావడమంటే, అది చదువును తగ్గించమని కాదు. చదువును సరైన పద్ధతిలో చదువుకోవాలి. ఒక విద్యార్థి రోజుకు ఐదు గంటలు చదివినా, దాని ఫలితం ఆ విద్యార్థి ఏం చదివాడన్నదానిపై ఆధారపడుతుంది. మరో విద్యార్థి రోజుకు రెండు గంటలు మాత్రమే చదివినా, ఆ విద్యార్థి ముఖ్యాంశాలను అర్థం చేసుకుని, వాటిని పునరావృతం చేస్తూ, ప్రశ్నల నమూనాను గమనిస్తూ చదివి, ఎక్కువ మార్కులు తెచ్చుకుంటాడు. అందుకే తెలివిగా చదువుకోవాలి. తెలివిగా పరీక్షలకు సిద్ధం కావాలి. తెలివిగా చదవడం అంటే సమయాన్ని, శక్తిని, దృష్టిని సరైన దిశలో పెట్టడం. దిశ సరిగ్గాఉన్నప్పుడు చిన్నశ్రమ కూడా పెద్ద ఫలితాన్ని ఇస్తుంది.. 'సరైనా దారిలో నడిచినవాడే గమ్యం చేరుతాడు' అన్నట్లు.

పరీక్షా సిద్ధతలో మొదటి తెలివైన అడుగు..సిలబస్‌ను అర్థం చేసుకోవడం. చాలామంది విద్యార్థులు పుస్తకం మొత్తం చదవడానికి ప్రయత్నిస్తారు. కానీ పరీక్షల్లో వచ్చే ప్రశ్నలు సిలబస్‌లోని ముఖ్యమైన భాగాలనుంచే వస్తాయి. ఒకసారి సిలబస్‌ను పూర్తిగా అర్థం చేసుకున్న విద్యార్థి, ఏ అధ్యాయం ఎంత ముఖ్యమో, ఏ అంశం ఎంత లోతుగా చదవాలో తెలుసుకుంటాడు. ఉదాహరణకు, చరిత్రలో "స్వాతంత్ర్య ఉద్యమం" అనే అధ్యాయానికి ఎక్కువ మార్కులు వచ్చే అవకాశం ఉన్నప్పుడు, దానిపై ఎక్కువ సమయం పెట్టడం తెలివైన సిద్ధత. కానీ అదే అధ్యాయాన్ని పక్కన పెట్టి, తక్కువ ప్రాధాన్యమున్న అంశంపై గంటల తరబడి కూర్చోవడం, కష్టపడి చదవడమే అంటారు కానీ..తెలివిగా చదవడం కాదు.

## ప్రశ్నల నమూనాలను అర్థం చేసుకోవాలి :

పరీక్షా సిద్ధతలో రెండో తెలివైన అడుగు ప్రశ్నల నమూనాను అర్థం చేసుకోవడం. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలు, నమూనా ప్రశ్నలు, గురువు ఇచ్చే సూచనలు.. ఇవి అన్నీ విద్యార్థికి మంచి దిశ చూపుతాయి. గత ప్రశ్నలను చూసిన విద్యార్థి పరీక్షలో ఏమి ఎదురవుతుందో ముందే అంచనా వేయగలడు. ఉదాహరణకు, సైన్స్‌లో "ప్రయోగాల ఆధారిత ప్రశ్నలు" ఎక్కువగా వస్తే, వాటిని అర్థం చేసుకోవడమే తెలివైన సిద్ధత. కేవలం నిర్వచనాలు కంఠస్థం చేయడం కష్టపడి చదవడమే కానీ ఫలితం ఇవ్వదు. తెలివిగా సిద్ధం కావడంలో మరో ముఖ్యమైన అంశం..పునరావృతం. అంటే, పుస్తకాన్ని మళ్లీ చదవడం కాదు; ముఖ్యాంశాలను గుర్తుచేసుకోవడం, వాటిని మనసులో పునర్నిర్మించుకోవడం. ఉదాహరణకు, ఒక అధ్యాయం చదివిన తర్వాత, పుస్తకం మూసేసి, 'ఈ అధ్యాయంలో ప్రధానంగా ఏమి నేర్చుకున్నాను?' అని మనసులో ప్రశ్నించుకోవడం తెలివైన పునరావృతం. కష్టపడి చదవడంలో పెద్ద సమస్య అలసట. గంటల తరబడి చదివితే, మనసు మసకబారుతుంది, దృష్టి తగ్గుతుంది. కానీ తెలివిగా చదివే విద్యార్థి చిన్న చిన్న విరామాలు తీసుకుంటాడు, మనసును తాజాగా ఉంచుకుంటాడు, చదువును ఎలా చదువుకోవాలో ఆలోచించి పలు భాగాలుగా విభజిస్తాడు. ఉదాహరణకు, 45 నిమిషాలు చదివి, 10 నిమిషాలు విరామం తీసుకోవడం మనసును తాజాగా ఉంచుతుంది. ఇది కష్టపడి చదవడం కాదు; తెలివిగా చదువుకోవడమన్నమాట. ఇప్పుడు ఒక చిన్న ఉదాహరణ చూద్దాం. ఒక విద్యార్థి సైన్స్ పరీక్షకు సిద్ధమవు తున్నాడని అనుకుందాం. ఆ విద్యార్థి పుస్తకంలోని ప్రతి పేజీని కంఠస్థం చేయడానికి ప్రయత్నిస్తాడు, కానీ ప్రయోగాల వెనుక ఉన్న భావాన్ని అర్థం చేసుకోడు. మరో విద్యార్థి అదే అధ్యాయాన్ని చదువుతున్నప్పుడు, ప్రతి ప్రయోగం ఎందుకు చేస్తారు, దాని ఫలితం ఏమి సూచిస్తుంది, పరీక్షలో దాన్ని ఎలా ఉపయోగించాలి..అనే వాటిపై దృష్టి పెడతాడు. మొదటి విద్యార్థి ఎక్కువ సమయం వినియోగించినా, రెండో విద్యార్థి తక్కువ సమయంతోనే ఎక్కువ అర్థం చేసుకుంటాడు. "అర్థం ఉన్న చదువు అర్ధాంతరమవదు" అన్నట్లుగా, అర్థంతో చేసిన సిద్ధతే పరీక్షలో మెరిసే ఫలితాన్ని ఇస్తుంది.

చివరగా, పరీక్షా సిద్ధత అనేది కేవలం చదువుకు సంబంధించిన విషయం కాదు; అది మనసు, సమయం, దృష్టి, వ్యూహం..అన్నీ కలిసిన సమగ్ర సిద్ధత. తెలివిగా సిద్ధంకావడం అంటే మన శక్తిని సరైన దిశలో పెట్టడం. కష్టపడి చదవడం అంటే శక్తిని ఎక్కువగా ఉపయోగించడం. తెలివిగా చదివే విద్యార్థి తక్కువ శ్రమతో ఎక్కువ ఫలితం పొందుతాడు. పరీక్షల్లో రాణించాలంటే కష్టం అవసరం, కానీ దానికి సరైన దిశ ముఖ్యం. ఆ దిశే తెలివైన సిద్ధత.. అదే సన్నద్ధత!.. అదే విజయానికి సరైన మార్గం!..



**వచ్చే వారం:** చదువులో టెక్నాలజీ :
తెలివిగా ఉపయోగించే కళ

E-mail: reddyu@gmail.com

## త్వరలో రాష్ట్ర పండుగగా...

# పెంచలకోన బ్రహ్మోత్సవాలు

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం, పక్కన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తదితరులు

పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా, పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఇటీవల ఆయన వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణతో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈనెల 27వ తేదీ నుంచి మే 3వతేదీ వరకు జరగనున్న బ్రహ్మోత్సవాల కోసం అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్వామివారి దర్శనం ప్రశాంతంగా జరిగేలా క్యూలైన్లు, బారికేడింగ్, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా హనుమంతుని సేవ, గరుడ సేవ, కళ్యాణ ఉత్సవం రోజుల్లో భక్తులకు ఉచితంగా లడ్డూ ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కాణిపాకం, శ్రీశైలం, శ్రీకాళహస్తి, మాలకొండ, కదిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయాల తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. పెంచలకోన శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఇటీవల రూ.6.50కోట్లు మంజూరైనట్లు, బ్రహ్మోత్సవాల అనంతరం పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. నెల్లూరు ఆర్డీవో అనూష, దేవాదాయ శాఖ ఆర్‌జేసి ఆజాద్, జిల్లా దేవాదాయ శాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, ఫెస్టివల్ కమిటీ చైర్మెన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పైలేరియాతో జాగ్రత్త!

పైలేరియా వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని, ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి, ఆరోగ్యం దెబ్బతినకుండా చూసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజాత చెప్పారు. ఇటీవల ఆమె నెల్లూరులోని తమ కార్యాలయంలో పైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్‌లను పంపిణీ చేశారు. ఈ వ్యాధి నివారణకి ఆరోగ్యకేంద్రాల్లో మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి, వారికి చికిత్సలు అందుబాటులోకి తేవాలని ఆమె ఆరోగ్య అధికారులు, సిబ్బందికి సూచించారు.

## ఆకట్టుకున్న 'చమత్కార సాహిత్యం'

నెల్లూరులోని చేతన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఇటీవల స్థానిక టౌన్‌హాల్ రీడింగ్‌రూమ్‌లో జరిగిన 'చమత్కార సాహిత్య వైభవం' కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. భాషాప్రవీణ ఎం.కృష్ణకిషోర్ (రేపల్లె) ప్రధాన ఉపన్యాసకులుగా పాల్గొని చమత్కార సాహిత్య సౌరభాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన చెప్పిన చమత్కార పద్యాలు సభికులను అలరించాయి. కేంద్ర బాలసాహిత్య అవార్డు గ్రహీత డా.గంగిశెట్టి శివకుమార్, చేతన నిర్వాహకులు శేషగిరీశం, డా.ఎం.సుబ్రహ్మణ్యం, కవులు–కవయిత్రులు బొగ్గరపు రాధాకృష్ణ, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్ ఐఎస్టీకి..

# జాతీయస్థాయి అవార్డు



'టీమ్ చారియట్' సభ్యులని అభినందిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సయాసిస్ బైసికిల్ డిజైన్ కాంపిటీషన్ (బీడీసీ)–2026లో కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విద్యార్థుల 'టీమ్ చారియట్' జట్టు మానవరబిలిటీ విభాగంలో జాతీయస్థాయిలో మూడవ బహుమతిని అందుకుంది. దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం నిర్వహించే ఈ ప్రతిష్టాత్మక పోటీ బైసికిల్ డిజైన్, తయారీ, పనితీరు, సృజనాత్మకత వంటి అంశాలపై విద్యార్థుల నైపుణ్యాలను పరీక్షిస్తుంది. కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ, జట్టు సభ్యుల కృషి, పట్టుదల, సాంకేతిక నైపుణ్యమే ఈ విజయానికి ప్రధాన కారణమన్నారు. ఈ సందర్భంగా 'టీమ్ చారియట్' సభ్యులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

### ఎన్‌బీకేఆర్ కళాశాల వార్షిక సాంస్కృతిక ఉత్సవం

ఎన్‌బీకేఆర్ కళాశాల వార్షిక సాంస్కృతికోత్సవంలో భాగంగా ఇటీవల 'ఏక్‌స్టాటికా–2026' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్‌రెడ్డి దీపప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వార్షికోత్సవంలో కళాశాల విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, గానం మరియు స్కిట్లు అందరినీ అలరించాయి. 'గేట్' ర్యాంక్ సాధించిన వారికి మెమెంటోలు బహూకరించారు.

# గూడూరు డివిజన్

## చంద్రబాబు ఆలోచనలు.. వినూత్నం

### కొనియాడిన ఎమ్మెల్యే పాశం



'అన్న క్యాంటీన్'లో భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

'జన్మభూమి, 'డయిల్ యువర్ సీఎం' వంటి వినూత్న ఆలోచనలతో ప్రజలకి ప్రభుత్వాన్ని చేరువ చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ కొనియాడారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 76వ పుట్టినరోజుని పురస్కరించుకొని నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టిడిపి నాయకులు భోజనం చేశారు. వచ్చిన పేదవారితో ఆహార రుచి, శుభ్రతపై అడిగి తెలుసుకున్నారు. తోపుడుబండ్ల వ్యాపారస్తులకు గొడుగులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్న క్యాంటీన్లలో ఈరోజు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి భోజనానికి అయ్యే ఖర్చును అందజేశారని తెలిపారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఆయన ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని తెలిపారు. పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో మధుసూదన్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెండో పట్టణ సీఐగా మాలకొండయ్య



గూడూరు రెండో పట్టణ సీఐగా మాలకొండయ్య రెండో పట్టణ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో శ్రీహరికోట మెరైన్ పోలీస్‌స్టేషన్‌లో సి.ఐగా పనిచేశారు. సాధారణ బదిలీలలో భాగంగా గూడూరు రెండో పట్టణ సీఐగా వచ్చారు. ఇక్కడ పనిచేసిన సి.ఐ శ్రీనివాస్ విఆర్‌కి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

## శ్రీ చైతన్యలో...

# తల్లిదండ్రులకు 'పాద పూజ'



తల్లులకి పాదపూజ చేస్తున్న విద్యార్థినీవిద్యార్థులు

విద్యార్థులకు విద్యతో పాటు మానవీయ విలువలు నేర్పాలనే లక్ష్యంలో భాగంగా ఇటీవల గూడూరు పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం 'హ్యాపీ క్లబ్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులను ఆహ్వానించి, వారి పిల్లలచే వారి పాదాలు కడిగి పూజలు చేశారు. తల్లిదండ్రుల నుండి పిల్లలు ఆశీర్వాదాలు తీసుకున్నారు. ముఖ్య అతిథిగా శ్రీచైతన్య పాఠశాల ఏజీఎం ఎన్.శ్రీకాంత్ పాల్గొని మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు కనుక.. విద్యార్థులు సమాజంలో మంచిపౌరులుగా ఉండడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాసులు, డీన్‌లు శ్రీహరిబాబు, హరి బ్రహ్మయాదవ్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ వితరణ



శ్రీ శ్రీ శ్రీ విజయదుర్గ పీఠాధిపతుల వారి దివ్య ఆశీస్సులతో ప్రతి ఆదివారం, పౌర్ణమి, అమావాస్య తిథులతో పాటు ముఖ్య పర్వదినాలలో నిర్వహించే అన్నప్రసాద వితరణతో పాటుగా తీవ్రమైన ఎండలలో దూర ప్రాంతాల నుంచి గూడూరులో పనుల నిమిత్తంగా విచ్చేస్తున్నవారికి, అలాగే గూడూరు ప్రాంతాలలో ఎండలలో తప్పని పరిస్థితులలో తిరుగుతున్న వారికి గత వారం నుంచి శ్రీ సీతమ్మ జలధార ద్వారా మజ్జిగ వితరణ విశేష రీతిలో చేస్తున్నారు. రెండు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. కోట సునీల్, కిషోర్ చందు, చంద్రనీల్, సర్దార్ చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.




విద్యార్థులని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

## ఒలంపియాడ్ ఫౌండేషన్‌లో

# అగ్రగామిగా శ్రీ గాయత్రి

గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఇటీవల 'ఈ అభ్యాస్ అకాడమీ' ఆధ్వర్యంలో గుంటూరు మెడికల్ కాలేజీ ఆడిటోరియం నందు రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అవార్డులు సాధించిన హుమేరా, అరవింద్‌రెడ్డి, నైనిక, వర్ధన్‌లకు స్కూలులో అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డివిఎంసి మెంబర్ కోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులకి ప్రాథమిక స్థాయి నుంచే ఐఐటి, నీట్, ఒలంపియాడ్ ఫౌండేషన్‌కి అద్భుతమైన కోచింగ్ ఇవ్వడం అభినందనీయమని శ్రీ గాయత్రి స్కూల్ యాజమాన్యాన్ని కొనియాడారు. రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ మాకాని వెంకటేశ్వర్లు, బెస్ట్ టీచర్ అవార్డీ రాధయ్య, స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తిలక్‌నగర్‌లో పోషణ్ పక్వాడ



గూడూరు మండల పరిధిలోని తిలక్‌నగర్ గ్రామంలో ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ అధికారిణి మెహబూబీ 'పోషణ్ అభియాన్ పక్వాడ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మన పిల్లల భవిష్యత్తు మన చేతుల్లో ఉందని, మొలకెత్తిన విత్తనాలు, ఆకుకూరలు, కాయగూరలు, తృణధాన్యాలు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పసి బిడ్డలకు ఎక్కువగా తల్లి పాలు ఇస్తూ ఉండాలని తెలిపారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ స్వరూపరాణి, సునీతకుమారి, రాధామణి తదితరులు పాల్గొన్నారు.



జనసేన నాయకుడు చిట్టమూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఇటీవల ఆయన ఇంటికి వెళ్లి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు, చిట్టమూరు కుటుంబ ఆత్మీయులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, అలాగే ప్రవీణ్ ఆప్తమిత్రుడు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.

# బెంగళూరులో సీఎం జన్మదిన వేడుకలు

## • పాల్గొన్న టీడీపీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి



రావి మోహన్‌చౌదరికి కేకుని తినిపిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19న బెంగళూరులో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బెంగళూరు టీడీపీ ఫోరమ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కర్ణాటక టీడీపీ కో-ఆర్డినేటర్ రావి మోహన్‌చౌదరి పాల్గొని మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తన సుదీర్ఘమైన పాలనానుభవంతో రాష్ట్రానికి నవోదయం తెచ్చారంటూ కొనియాడారు. ప్రభుత్వ విప్‌లు.. శాసనమండలి సభ్యులు డా. వేపాడ చిరంజీవిరావు, డా. కంచర్ల శ్రీకాంత్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బెంగళూరు టీడీపికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి ఆధ్వర్యంలో..

# 'స్వచ్ఛాంధ్ర'

నెల్లూరులోని 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడగవే (కమాండింగ్ ఆఫీసర్) ఆదేశాల మేరకు ఇటీవల స్థానిక వెంగళ రావునగర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సిసి ఫస్ట్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఎన్‌సిసి కేడెట్లు దర్గామిట్టలోని నెల్లూరు స్వర్ణాలచెరువు పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసి స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు, శానిటరీ ఇన్స్పెక్టర్లు సచివాలయ ఉద్యోగులు అందరూ కలిసి ఆ పరిసరాల్లోని చెత్తా చెదారాన్ని ఏరివేసి శుభ్రం చేశారు.

## చిలకలమర్రి.. బడిపిల్లల

# కథలు ఆవిష్కరణ



ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా నెల్లూరుజిల్లా కలువాయి మండలం చిలకలమర్రి జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాసిన 'చిలకలమర్రి బడిపిల్లల కథలు' పుస్తకాన్ని ఈనెల 23న మండల విద్యా వనరుల కేంద్రంలో ఆవిష్కరించారు. మండల విద్యాశాఖ అధికారులు పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా ఈ పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కథలు రాసిన విద్యార్థులు పెంచల ప్రసన్న, మల్లిక, సుచిత్ర, హారిక, మహేశ్వరి, వైష్ణవిలను, ఉపాధ్యాయులు డాక్టర్ మున్నెల్లి శివశంకరయ్య, కర్మయోగి చల్లా చంద్రశేఖర్‌రెడ్డిలను మండల విద్యాశాఖ అధికారులు సన్మానించారు. ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు రాసిన 50 స్ఫూర్తిదాయక కథలను పుస్తక రూపంలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు.



# ఆర్టీసీకి ఫ్యాన్‌ల బహూకరణ..!

నగరంలోని ప్రముఖ డయాబిటీస్ వైద్య నిపుణుడు డాక్టర్ వేమిరెడ్డి సురేష్‌రెడ్డి నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ ప్రయాణికుల సౌకర్యార్థం 12 ఫ్యాన్లని ఉచితంగా అందించారు. ఆర్టీసీ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అభ్యర్థన మేరకు డాక్టర్ సురేష్‌రెడ్డి ఈ ఫ్యాన్లని అందజేశారు.

## పేదోడి ఆకలి తీర్చే

# గొప్ప పథకం..'అన్నా క్యాంటీన్'

## రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



'అన్న క్యాంటీన్'లో పేదలతో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

'అన్నా క్యాంటీన్లంటే' పేదలకు అన్నం పెట్టే క్యాంటీన్లని, పేదోడి ఆకలి తీర్చే గొప్ప పథకం అన్నా క్యాంటీన్లేనని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 76వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఆ ఒక్క రోజే 76 లక్షల రూపాయలు సొంత నిధులను అన్నా క్యాంటీన్లకు వితరణగా ఇవ్వడం శుభపరిణామమని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవం సందర్భంగా ఈనెల 21న నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని 32వ డివిజన్ డైకాస్‌రోడ్డు సెంటర్‌లో ఆయన 'అన్నా క్యాంటీన్'లో భోజన వితరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గత వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం పేదోడి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను దుర్మార్గంగా మూసివేసిందని ఆయన ఈ సందర్భంగా విమర్శించారు. అన్నా క్యాంటీన్లు పూర్తిస్థాయిలో సమర్థవంతంగా ముందుకు సాగాలంటే స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరమని ఆయన సూచించారు. స్థానిక శాసనసభ్యుడిగా అన్నా క్యాంటీన్లను సక్రమంగా నిర్వహించేందుకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి తాను పూర్తి బాధ్యత తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీటి ప్రాజెక్టులు గొప్పవే..నిర్వహించేవారే లేరు!

## • ఖాళీలు భర్తీచేయాలన్న బీజేపీ నేత



సోమశిల ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ రమణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మిడతల రమేష్

రాష్ట్రవ్యాప్తంగా కోట్లాదిరూపాయల విలువైన నీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ, వాటి నిర్వహణకు అవసరమైన సిబ్బంది మాత్రం కరువయ్యారని, ప్రభుత్వం ఈ విషయం గమనించి వెంటనే ఆ ఖాళీలలను భర్తీ చేయాలని బీజేపీ నేత, నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ డిమాండ్ చేశారు. ఇటీవల ఆయన నెల్లూరులోని సోమశిల ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజనీర్ బివి రమణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 26 భారీ, 61 మధ్యతరహా, 38,422 చిన్న తరహా నీటి పాజెక్టులు ఉన్నాయని, అయితే జిల్లా రైతాంగానికి ప్రాణప్రదమైన సోమశిల డ్యామ్ నిర్వహణకు 52 మంది సిబ్బందికి గాను కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా, జిల్లాలో మరో ముఖ్యమైన కండలేరు డ్యామ్ నిర్వహణకు 33 మంది ఉండాల్సివుంటే, కేవలం అయిదుగురు మాత్రమే ఉన్నారని వివరించారు. కర్నూలుజిల్లాలో కూడా శ్రీశైలం డ్యామ్ నిర్వహణకు 78 మందికి గాను 22 మంది మాత్రమే ఉన్నారని, నాగార్జునసాగర్ డ్యాం నిర్వహణకు 70 మందికిగాను 19మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. నీటి ప్రాజెక్టులకు సంబంధించి ఉన్నత స్థాయి అధికారులు 6136 మంది విధులు నిర్వహించాల్సి ఉండగా, అందులో సగానికి సగం ఆ పోస్టులు ఖాళీగానే ఉన్నాయని, కేవలం 3472 ఇంజనీర్లు మాత్రమే విధులలో ఉన్నారని తెలిపారు. వివిధ ప్రాజెక్టులలో ఎంతో కీలకమైన లస్కర్లు 7224 మంది విధులలో ఉండాల్సి ఉండగా ఔట్‌సోర్సింగ్ ద్వారా 1033 మంది మాత్రమే విధులలో ఉన్నారని గుర్తుచేశారు. జీవో నెంబర్ 98 ప్రకారం జలాశయం ముంపువాసుల కుటుంబాలలో ఇంటికొక ఉద్యోగం ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని, ఇప్పటికైనా జల వనరుల శాఖలో ఉన్న ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని ఆయన కోరారు.

# తలసీమియా చిన్నారులకు..ఉచిత వైద్యపరీక్షలు



తలసీమియాతో బాధపడుతున్న చిన్నారులకు నెల్లూరులోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఎంజిఎం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వారి నేతృత్వంలో ఈనెల 22 ఉచిత వైద్యపరీక్షలు చేశారు. నగరంలోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉన్న తలసీమియా డే కేర్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, దాతల సహకారంతో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి సత్వర చికిత్సలు అందించేందుకు, వారిని ఆరోగ్యవంతులుగా చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత, ఎంజిఎం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు రిషభ్ భరద్వాజ్, దీనదయాళన్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హేమకుమార్, రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ యశోవర్ధన్, డాక్టర్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సిబిఎన్ అంటే..ఒక బ్రాండ్

## ఎమ్మెల్యే సోమిరెడ్డి



సిబిఎన్ బర్త్‌డే కేకును కట్ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

చంద్రబాబునాయుడు అంటేనే ఒక బ్రాండ్ అని, భావితరాల బంగారు భవిష్యత్తును కాంక్షించి పనిచేసే దార్శనికుడని, అలాంటి విజనరీ లీడర్‌తో కలిసి నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేసే అవకాశం లభించడం తాను అదృష్టంగా భావిస్తున్నానని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా పొదలకూరు మండలం ప్రభగిరిపట్నం పంచాయతీ ఉలవరపల్లి గిరిజన కాలనీలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొని, భారీ కేకును కట్‌చేసి కార్యకర్తలకు, నాయకులకు పంచిపెట్టారు. టీడీపీ నాయకులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, చంద్రబాబు అంటే ఏ పూటకు ఆ పూట రాజకీయం చేసే నాయకుడు కాదని, భావితరాలను కూడా దృష్టిలో పెట్టుకుని ప్రజల అభ్యున్నతికి కృషిచేసే నాయకుడని అన్నారు. అమరావతిని దేశం లోనే ఒక మోడల్ రాజధానిగా తీర్చిదిద్దబోతున్నారన్నారు. ఈ అభివృద్ధిని చూసి ఓర్చుకోలేని వారు కడుపుమంటతో పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు కూడా పూర్తికాబోతున్నాయని, ప్రజానాయకుడిగా తనకున్న సుదీర్ఘ అనుభవంతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారన్నారు. అంత గొప్ప నాయకుడితో నాలుగు దశాబ్దాలకుపైగా కలసి పనిచేసే అవకాశం లభించడమే కాక, ఆయన మంత్రివర్గంలో మూడుసార్లు మంత్రిగా పని చేయడం తనకు లభించిన అదృష్టమని సోమిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

# ఎన్జీవో హోమ్‌లో చలివేంద్ర




చలివేంద్రని ప్రారంభిస్తున్న ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ నాయకులు

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఎన్జీవో హోంలో ఇటీవల చలివేంద్ర ఏర్పాటుచేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బండారుపల్లి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అసోసియేట్ అధ్యక్షులు ఆంజనేయవర్మ ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కాకుల పెంచలయ్య కోశాధికారి ప్రసాద్ రెడ్డి వైస్ ప్రెసిడెంట్ కే రాజేంద్రప్రసాద్ పి.సతీష్ బాబు, పి.జనార్దన్‌రావు, టీ.మల్లికార్జునరావు, ఇ.కరుణమ్మ, కే.ప్రేమలత, సంయుక్త కార్యదర్శి పి.రవికుమార్, ఎన్.గిరిధర్, సిహెచ్ వీరబ్రహ్మేశ్వర రావు, కే.సురేష్, ఎం.రాజేంద్ర, పి.రమ్య నగర అధ్యక్షులు చిలకా రామ కృష్ణారెడ్డి, కార్యదర్శి కృష్ణకుమార్, జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ కార్మికుల ధర్నా

మార్చి నెలకి సంబంధించిన జీతాలు చెల్లించాలని, గత 14 రోజుల సమ్మెకాలపు వేతనాలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న నెల్లూరు నగరపాలక సంస్థ ఎదుట మునిసిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మునిసిపల్ వర్కర్స్ అంటే ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటియు అనుబంధ సంస్థ) ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో యూనియన్ జిల్లా శాఖ గౌరవాధ్యక్షులు కె.పెంచలనరసయ్య మాట్లాడుతూ, సమ్మెకాలపు జీతాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి రెండునెలలు గడుస్తున్నా ఇంతవరకు ఆ జీతాలు ఇవ్వలేదన్నారు. మార్చి నెల జీతం కూడా రాక పోవడంతో కార్మికుల కుటుంబాల జీవనపరిస్థితులు అస్తవ్యస్థంగా తయారయ్యాయని మండిపడ్డారు. ఇకనైనా తమ సమస్యలు తీర్చకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. ఆ మేరకు మునిసిపల్ కార్పొరేషన్ వైఓ నందన్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ ఆందోళనలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వీఆర్ హైస్కూల్లో గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకి సర్టిఫికేట్లను అందజేస్తున్న కమిషనర్ వై.ఓ.నందన్

నెల్లూరులోని వి.ఆర్.మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఈనెల 22న గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. చిన్నారులు గ్రాడ్యుయేషన్ క్యాప్‌లు, గౌన్‌లు ధరించి తమ సర్టిఫికేట్లు అందుకున్నారు. విద్యార్థులు తమ పాటలు, నృత్యాలు, ప్రసంగాలతో అందరినీ ఆకట్టుకున్నారు. ముఖ్యఅతిథులుగా నెల్లూరు మున్సిపల్ కమిషనర్ వై.ఓ.నందన్ డా.ఎం.బి.రామ మోహన్, డా.ఎ.యామిని, డా.కె.ఆర్.హర్షవర్ధన్ పాల్గొన్నారు. రాష్ట్ర పురపాలక మంత్రి నారాయణ, వారి కుమార్తె శరణి, విద్యామంత్రి నారా లోకేష్ సేవలు, విద్యారంగంలో వారి కృషి గురించి వక్తలు వివరించారు. ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, ఇన్‌చార్జ్ హెచ్.ఎం లక్ష్మీనారాయణ, పీడీ గురుప్రసాద్, వైస్ ప్రిన్సిపల్స్ చంద్రకళ, హరిత, జయలక్ష్మి, ఏ.ఓ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి.

# వీఎస్సార్ విద్యార్థులకు బహుమతులు



విద్యార్థులకి బహుమతులు, పతకాలు అందజేస్తున్న ముఖ్యఅతిథులు

గూడూరు రెండో పట్టణం, వీరారెడ్డిపల్లిలోని వీఎస్సార్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో బుధవారం జరిగిన 'ఐఐటి అచీవర్స్ మెరిమనీ' కార్యక్రమంలో ఆరో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు ప్రతి తరగతిలో మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, పతకాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల పూర్వవిద్యార్థి వెంకటక్రిష్ణ మాట్లాడుతూ... విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని చదివితే ఉన్నత లక్ష్యాలను అందుకోవచ్చని వివరించారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకంతో పాటు పతకాలు అందజేశారు. పాఠశాల డైరెక్టర్ బాలక్రిష్ణం రాజు, విట్రాన్ ఐఐటి ఇన్‌చార్జి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# 26 నుంచి.. ఆదిశంకర సంస్మరణోత్సవాలు



నెల్లూరు ఆదిశంకర ధ్యానమందిరం-చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి జగద్గురు శ్రీ ఆదిశంకర సంస్మరణ పంచమ సప్తాహం జరుగనుంది. మే 2వ తేదీ వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 26న మహిళా భక్తమండలి వారిచే సామూహిక విష్ణు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, ముదివర్తి లక్ష్మీ కామాక్షి భక్తిగీతార్చన ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా 27 నుంచి 29వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6.30 నుండి 8.30 గంటల వరకు ప్రముఖ ఆధ్యాత్మిక సాహిత్యోపన్యాసకురాలు డా. కప్పర గిరిజాలక్ష్మి 'భగవద్గీత ప్రవచనాలు' ఉంటాయని, 30న కాపూరి హేమలక్ష్మి బృందం వారి వీణానాద నీరాజనం, భక్తిగీతాలాపనలు నిర్వహిస్తారని తెలిపారు. మే1న బ్రహ్మశ్రీ బ్రాహ్మణపల్లి శ్రీధరబాబు 'శాస్త్రీయంగా, మనోవిజ్ఞానపరంగా నిత్య శాశ్వత అద్వైత అనుభూతి' అనే అంశంపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని చక్రాల ఆనందకుమార్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# 'నూరు సరాలు' పుస్తకావిష్కరణ



'నూరు సరాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

ప్రముఖ రచయిత డా.రాచపాళెం రఘు రచించిన 'నూరు సరాలు' పుస్తకాన్ని ఈనెల 22న నెల్లూరు టౌన్‌హాలులో ఆవిష్కరించారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రత్నమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్య కళాపరిషత్ అధ్యక్షులు స్వర్గీయ మెట్టు రామచంద్ర ప్రసాద్ (ఎంఆర్ ప్రసాద్) స్మారకార్థకం రచయిత రఘు తన పుస్తకాన్ని అంకితం గావించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేంద్ర జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ సి.హెచ్.ఉషా కిరణ్, నెల్లూరు జిల్లా క్రైం రికార్డ్స్ బ్యూరో సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎన్.రామారావు, పుస్తక సమీక్షకులు డాక్టర్ కె.లక్ష్మీ నారాయణరెడ్డి, ఎ.జయప్రకాష్, షేక్ రియాజ్ బాషా, మెట్టు స్వరాజ్య లక్ష్మి, ఎన్.బాలరామయ్యనాయుడు, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, మురళీమోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# టూకీగా...



## కావలిలో.. 'మనబడి-జ్ఞానబాట'

కావలి పట్టణంలో ఈనెల 21న అధికారులు 'మనబడి-జ్ఞానబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. పెంకులఫ్యాక్టరీలోని గిరిజన పాఠశాలలో కొత్తగా 11 మంది విద్యార్థులు చేరిన సందర్భంగా ఎంఇఓ బి.గోవిందయ్య మాట్లాడుతూ, బడిఈడు పిల్లలందరూ తప్పనిసరిగా బడిలో చదువుకోవాలని, తద్వారా సమాజంలో మంచిస్థానం సంపాదించుకోవాలని సూచించారు.

## కోటలో పరిశుభ్రతపై అవగాహన

మండల కేంద్రమైన కోటలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈనెల 21న 'పల్లె పరిశుభ్రత' కార్యక్రమం నిర్వహించి చెత్త సేకరణ, తొలగింపులపై అవగాహన కలిగించారు. ఎంపీడీఓ ఆర్ దిలీప్‌కుమార్, మండలంలోని 13 పంచాయతీలకు చెత్త తరలించే రిక్షాలను పంపిణీ చేశారు. పల్లెల్లో చెత్త సేకరణకు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు.

## వెంగారెడ్డిపాలెంలో పాఠశాల వార్షికోత్సవం

సంగం మండలం వెంగారెడ్డిపాలెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఈనెల 21న జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మాజీ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఎంఇఓ బి.మల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు రోజారమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నార్త్‌రాజుపాలెంలో జనగణన శిక్షణపై పర్యవేక్షణ

కొడవలూరు మండలం నార్త్‌రాజుపాలెంలో జరుగుతున్న జనగణన శిక్షణను తహశీల్దార్ స్ఫూర్తిరెడ్డి ఈనెల 21న పర్యవేక్షించారు. ప్రతి ఇంటి సమాచారాన్ని పూర్తిస్థాయిలో నమోదు చేయడం ద్వారా ఈ సర్వేని విజయవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సుబ్బారావు, డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి, ఏఎస్ఓ గాయత్రి పాల్గొన్నారు.

## కోడూరు బీచ్‌లో పర్యాటకుల సందడి

తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు బీచ్‌లో ఈనెల 19న ఆదివారం సందర్భంగా పర్యాటకులు అధిక సంఖ్యలో రావడంతో కోలాహలం ఏర్పడింది. సందర్శకులు సాగరతీరంలో ఆటపాటలతో సందడి చేశారు. చెంతనే ఉన్న వేలాంగిణిమాత ఆలయాన్ని భక్తులు దర్శించుకున్నారు. తీరం వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎస్ఐ వీరేంద్రనాథ్ పర్యవేక్షించారు.

## బసినేనిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

సీతారామపురం మండలం బసినేనిపల్లి వద్ద పంటపొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నట్లుండి దగ్ధం కావడంతో అక్కడున్న ఆరెకరాల మొక్కజొన్న పంట కాలిపోయింది. ఎండవేడిమి వల్ల షార్ట్‌సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. అగ్నిమాపకదళం వారు వెంటనే వచ్చి మంటలు ఆర్పారు. లేకుంటే మరింతగా పంటలు కాలిపోయేవి.

## చేజర్లలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

మండల కేంద్రమైన చేజర్లలో ఈనెల 21న ఏపీ సిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిణి హిమబిందు ప్రకృతి వ్యవసాయంలోని పలు అంశాలను వారికి వివరించారు.

## కోడూరుపాడులో విద్యా వారోత్సవాలు

నెల్లూరు రూరల్ మండలంలోని కోడూరుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 18న 'బడి పిలుస్తోంది-విద్యా వారోత్సవాలు' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డా. ఆర్ బాలాజీరావు, విద్యార్థులు-తల్లితండ్రులతో ముఖాముఖి నిర్వహించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాలని చెప్పారు. ఎంఇఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

## దాసరిపల్లిలో 'పోషణ్ పక్వాడ'

ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని దాసరిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఈనెల 18న పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించి పిల్లలు, తల్లులకు పోషకాహార పదార్థాలపై, ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగించారు. సీడీపీఓ వై. పుణ్యవతి అంగన్‌వాడీ కార్యకర్తలు తగు సూచనలిచ్చారు.

# వాడవాడలా చంద్రబాబు జన్మదిన వేడుకలు

## • మంత్రి ఆనం సారధ్యంలో ఆయుష్య హోమం



ఆయుష్య హోమం నిర్వహిస్తున్న ఆనం

నవ్యాంధ్ర ప్రగతిరథ సారధి.. టీడీపీ అధినేత.. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 76వ జన్మదినోత్సవ సంబరాలు ఈనెల 20న జిల్లావ్యాప్తంగా జరిగాయి. వాడవాడలా పార్టీ కార్య కర్తలు, అభిమానులు, ఎమ్మెల్యేలు, నాయకులు కేకులు కట్‌చేసి తమ అధినేతకి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్తూ వేడుకలు జరుపుకున్నారు. విడవలూరు మండలం లక్ష్మీపురంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి-కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిలు చంద్రబాబు కటౌట్‌కి క్షీరాభిషేకం చేశారు. నెల్లూరురూరల్‌లో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఉదయగిరిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సర్వేపల్లిలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావలిలో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి పేదలకు అన్నదానం చేశారు. జిల్లా టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జడ్ శివప్రసాద్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మ దినోత్సవ వేడుకలు అంబరాన్నంటే సంబరంగా జరిగాయి.

### ఆత్మకూరులో ఆనం పూజలు :

రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరువద్ద నెల్లూరుపాళెం సమీపంలోని ఏఎంసీ ప్రాంగణంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిండునూరేళ్ళు సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, మంత్రి ఆనం సారధ్యంలో జరిగిన ప్రత్యేక పూజలు, ఆయుష్య హోమంలో అనేకమంది నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 23 మహిళా పొదుపు సంఘాలకు రూ.4.40 కోట్ల బ్యాంకు లింకేజి రుణాల జంబో చెక్కును, ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు కుట్టు యంత్రాలు, పట్టాదారు పాస్‌బుక్స్, పొజిషన్ సర్టిఫికెట్లు, డీఆర్‌డీఏ ద్వారా 158 మంది వీఓఏలకు మొబైల్ ఫోన్లు, రవాణా శాఖ ద్వారా వికలాంగులకు డ్రైవింగ్ లైసెన్సులు మంత్రి ఆనం సమక్షంలో అందజేశారు. గర్భిణులకు సీమంతాలు నిర్వ హించారు. మంత్రి ఆనం సొంత నిధులతో క్రీడాకారులకు ట్రాక్‌సూట్లు పంపిణీ చేశారు.

### విపిఆర్ దంపతులు సారధ్యంలో :

కోవూరులో అన్నా క్యాంటీన్‌లో సామా న్యులతో కలిసి భోజనం చేసిన ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని 'విపిఆర్ నేత్ర-2' సేవలను ప్రారంభించడం ఆనందంగా ఉం దన్నారు. విడవలూరు మండలంలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ప్రారంభించిన విపిఆర్ నేత్ర బస్సు మరియు బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో పి4 ద్వారా నిర్మించిన మార్కెట్ కాంప్లెక్సను ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు జన్మదిన కానుకగా అందిస్తున్నామన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకుని విపిఆర్ నేత్ర-2 సేవలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ఇది ఆయన పుట్టినరోజుకు తమ కానుక అని ప్రకటించారు.



నేత్ర సేవలందిస్తున్న విపిఆర్ నేత్ర-2 బస్సు

### నెల్లూరులో చంద్రన్న జన్మదిన వేడుకలు :



భారీ కేక్‌ని కట్ చేస్తున్న టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్ తదితరులు

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సూచనలతో నెల్లూరు నగర నియోజక వర్గంలో చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు పండుగలా జరిగాయి. రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆధ్వ ర్యంలో తొలుత నర్తకీ సెంటర్ వద్ద ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి భారీ గజమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 76 కేజీల భారీకేక్ కట్‌చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం, పేదలకు చీరల పంపిణీతో పాటు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

### ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల ఆధ్వర్యంలో :

ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో ఈనెల 20న వింజమూరు మండలంలోని బొమ్మరాజుపల్లిలో ఉన్న తమ క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు పండుగ కోలాహలంగా జరిగింది. సభా ప్రాంగణంలో భారీ కేకును కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ వారి సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, యువత, కార్యకర్తలు మరియు అభిమానులు భారీగా తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసి తమ అధినేతపై అభిమానాన్ని, సమాజ సేవాభావాన్ని చాటుకున్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

## మాజీ ముఖ్యమంత్రి..

# నాదెండ్ల అస్తమయం!



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు(90) ఇక లేరు. అనారోగ్యంతో ఆయన ఈనెల 22వతేదీ బుధవారం హైదరాబాద్ లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. అనేకమంది రాజకీయ నేతలు, ప్రముఖుల అశ్రుతర్పణాల మధ్య, వారి కుటుంబసభ్యులు గురువారం ఆయన పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. నాదెండ్ల భాస్కర రావుకు ఇద్దరు కుమారులు.. మనోహర్, మురళి. నాదెండ్ల మనోహర్ జనసేన నాయకునిగా, ప్రస్తుతం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రిగా ఉన్నారు.

శ్రీ నాదెండ్ల భాస్కర్‌రావు 1935 జూన్ 23న పిచ్చయ్య, వెంకాయమ్మ దంపతులకు తెనాలి డివిజన్, కొల్లూరు మండలం, దోనేపూడిలో జన్మించారు. హైదరాబాద్‌లో బీఏ పూర్తిచేసి అక్కడే ఈవెనింగ్ కాలేజీలో బి.ఏ.ఎల్.ఎల్.బి, ఎల్ఎల్‌జీ పట్టాలు పొంది న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ప్రముఖ న్యాయవాదిగా భాస్కర్‌రావు మంచిపేరు గడించారు. 1959లో లలితతో ఆయన వివాహం జరిగింది. న్యాయవాదిగా బిజీగా ఉంటూనే భాస్కర్‌రావు రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన తర్వాత అప్పటి పరిస్థితుల నేపథ్యంలో ఇందిరా కాంగ్రెస్‌లో ఏపీ జనరల్ సెక్రటరీగా పని చేశారు. 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 1978 నుంచి 1989 కాలంలో రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. 1984లో ఆగస్టు16 నుంచి సెప్టెంబరు 16వతేదీ వరకు నెలరోజుల పాటు ఆంధ్రప్రదేశ్‌కి ఆయన ముఖ్యమంత్రిగా సేవలందించారు. నాటి ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, టి.అంజయ్యల మంత్రివర్గంలో పనిచేశారు. 1983లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ హయాంలో భాస్కర్‌రావు ఆర్థిక మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో జరిగిన పరిణామాలతో రాజకీయాలకు కొంతదూరంగా ఉండేవారు. 1998లో ఖమ్మం నియోజకవర్గం నుంచి 12వ లోక్‌సభకు పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత బీజేపీలో చేరినా వృద్ధాప్యంతో, అనారోగ్యంతో కొంతకాలంగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. నాదెండ్ల భాస్కర్‌రావు మృతికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, జనసేన అధినేత..ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యామంత్రి లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర ప్రముఖులు విచారం ప్రకటిస్తూ, వారి కుటుంబానికి తమ సంతాపం తెలియజేశారు.

## నాడు భిక్షాటనతో బాధలు..

# నేడు ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాటలు!

### చదువు ఎంతటి మార్పు తెస్తుందో చూడండి!



బాలుడిని అభినందిస్తున్న కమిషనర్ నందన్

**చదువుకుంటే ఎంత ఉన్నతమైన స్థానాన్నయినా సంపాదించుకోవచ్చు. ఒకప్పుడు ఎలా బతికితేనేం..చదువులో రాణిస్తే భవిష్యత్తుకి ఢోకా ఉండదు. గతంలో భిక్షాటన చేస్తూ బతికినా, ఇప్పుడు స్కూల్‌లో కష్టపడి చదువుకుంటున్న ఓ బాలుడు.. ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడుతుంటే అందరూ ఆశ్చర్యపోతున్నారు. అవును ఇది నిజం!..చదువు వల్ల ఎంతటి స్థాయి వస్తుందో..మన కంటికి కనిపించే ఒక ప్రత్యక్ష సాక్ష్యం!..విద్యార్థిలోకానికి ఇది మార్గదర్శకం కూడా.**

నెల్లూరులోని వీఆర్ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఈనెల 22న జరిగిన ఈ ఘటన ఇప్పుడు నగరంలో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు భిక్షాటన చేస్తూ గడిపిన ఓ బాలుడు, ఈ స్కూల్‌లో చేరి ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడుతుండటం అందరినీ అబ్బురపరుస్తోంది. ఇదొక గొప్ప మార్పు అంటూ కార్పొరేషన్ కమిషనర్ నందన్ ఆ విద్యార్థిని అభినందించారు. కొంతకాలం క్రితం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ స్వయంగా ఆ బాలుడి దయనీయ స్థితిని గుర్తించి, యాచన మానేసి చదుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ స్కూల్‌లో అడ్మిషన్ ఇచ్చి చదువు పట్ల ఆసక్తి కలిగించారు. అప్పట్లో ఆ విషయం అందరికీ తెలిసిందే. సాక్షాత్తూ ఆ విద్యార్థే ఇప్పుడు మూడో తరగతికి ప్రమోట్ అయ్యాడు. ఇంగ్లీష్‌లో బాగా మాట్లాడుతున్నాడు.

### మంత్రి నారాయణ కృషి ఫలితమే ఇదంతా :

అంతర్జాతీయ స్థాయి వసతులు, నిష్ణాతులైన టీచర్లు, ఉచిత రవాణా సౌకర్యాలతో నెల్లూరులోని వీఆర్ ప్రభుత్వ పాఠశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందని కమిషనర్ నందన్ ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదంతా, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ దూరదృష్టికి నిదర్శనం. కార్పొరేట్ స్కూళ్లకు సైతం సవాల్ విసిరేలా ఈ ప్రభుత్వ బడిలోని 180 మంది చిన్నారులు బుధవారం నాడు మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగా పట్టాలు అందుకోవడం నెల్లూరు విద్యా చరిత్రలోనే ఒక మైలురాయి అని చెప్పుకోవచ్చు.

### 1065 మంది విద్యార్థుల చదువుల కోవెల :

మంత్రి నారాయణ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దిన ఈ పాఠశాల, 1065 మంది విద్యార్థులకు ఒక చదువుల కోవెలగా వెలుగొందుతోంది. మొదటి విద్యాసంవత్సరంలోనే ఊహించని విజయాలను నమోదు చేస్తూ విద్యారంగానికే వన్నె తెస్తోంది. కమిషనర్ నందన్ మాట్లాడుతూ, మంత్రి నారాయణ చొరవతో ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యం, పౌష్టికాహారం, కార్పొరేట్ టీచర్ల బోధన వల్ల 1065మంది విద్యార్థులు ఇక్కడ అద్భుతంగా రాణిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా 180 మంది విద్యార్థులకు ప్రీ-గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెడల్స్ పంపిణీ చేశారు. పట్టాలు అందుకున్న ప్రతి విద్యార్థి వెనుక మంత్రి నారాయణ కృషి, నిరంతర పర్యవేక్షణ ఉందన్న విషయాన్ని కమిషనర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com